



# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | మంగళవారం 8-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:31 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ప్రణబ్ ముఖర్జీ శిఖర సమాన నేత

**ఆయన మృతి దేశానికి తీరని లోటు**

**ఎన్నో పదవులతో వన్నె తెచ్చిన మహానుభావుడు**

**తెలంగాణ బిల్లుపై సంతకం చేసిన మహనీయుడు**

**శాసనసభలో తీర్మానం ప్రవేశ పెట్టి నివాళి అర్పించిన సిఎం కెసిఆర్**

**అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సభ్యులు ..ఏకగ్రీవంగా సంతాప తీర్మానం**

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): భారతరత్న, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మృతి పట్ల తెలంగాణ శాసనసభ సంతాపం తెలిపింది. ప్రణబ్ మృతికి రాష్ట్ర సీఎం కేసీఆర్ శాసనసభలో ప్రవేశపెట్టారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. ముందుగా మాజీ రాష్ట్రపతి, భారతరత్న ప్రణబ్ ముఖర్జీ మృతికి శాసనసభ సంతాపం తెలిపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణబ్ మృతిపై సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అలాగే మండలిలో సంతాప తీర్మానాన్ని హోంమంత్రి మహమూద్ అలీ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ భారతదేశం ఒక శిఖర సమానుడైన నాయకుడిని కోల్పోయిందన్నారు. అర్ధ తాబ్దంపాటు భారత రాజకీయాల లో క్రియాశీలక భూమిక పోషించిన ప్రణబ్ కర్మయోగి అని అభివర్ణించారు. అంకితభావంతో అంచెలంచెలుగా ఎదిగారని అన్నారు. చేపట్టిన ప్రతి పదవికి ప్రణబ్ వన్నె తెచ్చారని కేసీఆర్ కొనియాడారు. కేంద్రమంత్రిగా ప్రణబ్ విశేష సేవలు అందించారన్నారు. జటిల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రణబ్ నేర్పరి అని, తెలంగాణ సాధనలో ప్రణబ్ పాత్ర ఉందని సీఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ బిల్లుపై ప్రణబ్ సంతకం చేశారని కేసీఆర్ తెలిపారు. భారతదేశం శిఖర సమానమైన నాయకుడిని కోల్పోయింది. 1970 తర్వాత దేశ అభివృద్ధి చరిత్రలో ప్రణబ్ ముఖర్జీ పేరుకు ప్రత్యేక స్థానం ఉంది. క్రమశిక్షణ, కఠోర శ్రమ అంకితభావంతో అంచలంచలుగా ఎదిగారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను అత్యున్నత స్థాయిలో నిలబెట్టారు. ప్రపంచంలోనే ప్రణబ్ ముఖర్జీ ప్రముఖ ఆర్థికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. మహోన్నత రాజనీతిజ్ఞుడిగా మెలిగారు. రాజకీయాల్లో ఆయన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. మిత్ర పక్షాలను కలుపుకుని పోవడంలో విశ్వస నీయుడిగా ఆయన పేరొందారని ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ అన్నారు. ప్రతిపక్షాలను సిద్ధాంతపరంగా మాత్రమే విమర్శించేవారు. వ్యక్తిగతంగా విమర్శించే వారు కాదు. జటిల సమస్యను సామరస్యంగా పరిష్కరించే వారు ప్రణబ్. భారత 13వ రాష్ట్రపతిగా అత్యున్నత పదవి అలంకరించిన, జాతి నిర్మాణంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా 2019లో భారతరత్న అవార్డును బహుకరించారు. రాష్ట్ర అవతరణకు సహాయపడిన వారిగా కాకుండా, రాష్ట్ర విభజన బిల్లుపై ముద్ర వేసి తెలంగాణ చరిత్రలో నిలిచిపోయారు. ప్రణబ్ ముఖర్జీ మృతి పట్ల తెలంగాణ శాసనసభ సంతాపం తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానిస్తుంది అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ప్రణబ్ మృతి పట్ల తెలంగాణ శాసనసభ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని తెలిపారు. కెసిఆర్ తీర్మానాన్ని బలపరుస్తూ విపక్ష ఎంఐఎం సభ్యుడు పాషా ఖాద్రీ మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ సమస్యల్లో ఉన్న ప్రతి సందర్భంలో ప్రణబ్ ముఖర్జీయే గుర్తుకొచ్చేవారని ఖాద్రి అన్నారు. ప్రణబ్ దాదా వివిధ కేంద్ర మంత్రిపదవులు అలంకరించారని అన్నారు. వాటిని సమర్థంగా నిర్వహించారని, ఆయన మృతి దేశానికి తీరనిలోటని సంతాపం తెలిపారు. మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రణబ్ ఎంతో సహకరించారు అని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లుపై ప్రణబ్ రాజముద్ర వేసి చరిత్రలో నిలిచిపోయారు.

తెలంగాణ ఏర్పడిన సమయంలో రాష్ట్రపతి భవన్‌లో కేసీఆర్‌తో పాటు పలువురం ప్రణబ్‌ను కలిశాం. ఆ సందర్భంగా లక్ష్యం సాధించారంటూ కేసీఆర్‌ను ప్రణబ్ ప్రశంసించారని గుర్తు చేశారు. ప్రణబ్ తన పుస్తకంలో కేసీఆర్ గురించి ఉటంకించారు. ప్రణబ్‌ను భారతదేశం అపర రాజకీయ చాణుక్యుడిగా గుర్తు పెట్టుకుంటుందని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఐదు దశాబ్దాల పాటు భారత రాజకీయాల్లో సుదీర్ఘ సేవలందిం చారు. దేశానికి వారు అందించిన సేవలు ఎంతో విలువైనవి అని తెలిపారు. పలు రాష్ట్రాల్లో వచ్చిన ప్రజా ఉద్యమాలను ప్రణబ్ దగ్గరుండి చూశారు. తెలంగాణ ఉద్యమ స్వరూపాన్ని అర్థం చేసుకున్న గొప్ప నేత ప్రణబ్ అని కొనియాడారు. ఉద్యమం తీరుతెన్నులను పలుసార్లు కేసీఆర్ ప్రణబ్‌కు చెప్పేవారు. ఈ సమయంలో ప్రణబ్ అనేక సలహాలు ఇచ్చేవారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు.గొప్ప ఆశయం సాధించావని సీఎం కేసీఆర్‌ను ప్రణబ్ ముఖర్జీ మెచ్చుకున్నారని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో కలిసి అనేకసార్లు ప్రణబ్‌ముఖర్జీని కలిశామని చెప్పారు. సంతాప తీర్మానానికి ఆమోదం తెలుపుతున్నానని మంత్రి అన్నారు. ప్రణబ్‌ను కేసీఆర్ ఎప్పుడూ పితృసమానుడిగా చూశారని తెలిపారు. సీఎం కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు బీడీ కార్మికులకు 10 వేల ఇళ్లు కేటాయించారని వెల్లడించారు.

ప్రణబ్‌ముఖర్జీ కమిటీకి అనేక వినతులు ఇచ్చామని అన్నారు. కొన్నిరోజులపాటు ఢిల్లీలో ఉండి తెలంగాణ అంశంపై ప్రణబ్‌తో చర్చించామన్నారు. యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ అంశం ఉండేలా ప్రణబ్ కృషిచేశారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అన్ని రాజకీయ పార్టీలను కేసీఆర్ ఒప్పించారని, ఆయా పార్టీల నేతల ఆమోద పత్రాలను ప్రణబ్ కమిటీకి ఇచ్చామని గుర్తుచేసుకున్నారు.

తెలంగాణ ఉద్యమంతో మొదట్నుంచి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి అవినాభావ సంబంధం ఉందని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రణబ్ ముఖర్జీ కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉండేవారు. వారి పార్టీలో ఎలాంటి సమస్య వచ్చినా ప్రణబ్‌కే అప్పగించేవారు. అదే విధంగా తెలంగాణ సమస్యను కూడా ఎప్పుడూ ప్రణబ్‌కే అప్పగించేవారు. తెలంగాణ బిల్లుపై ప్రణబ్ సంతకం చేశారు. ప్రణబ్‌ను చూసి అనేక విషయాలు నేర్చుకోవచ్చు అని కేసీఆర్ అనేవారు అని మంత్రి తెలిపారు. కేసీఆర్‌ను ప్రణబ్ ఎన్నోసార్లు ప్రశంసించారు. ఒక లక్ష్యం కోసం ప్రారంభించిన ఉద్యమాలు ప్రపంచంలో అనేకం విజయవంతం అయ్యాయి. ఒక ఉద్యమాన్ని ప్రారంభించి.. లక్ష్యం సాధించిన కొంతమంది నాయకుల్లో కేసీఆర్ ఒకరు అని ప్రణబ్ అనేవారు అని మంత్రి గుర్తు చేశారు. ప్రణబ్ దేశచరిత్రలో నిలిచిపోతారు అని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కీలక పాత్ర పోషించారు అని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



కొనియాడారు. తెలంగాణ డిమాండ్ న్యాయమైందని ప్రణబ్ చెప్పేవారు. రాజకీయాల్లో అందరి గౌరవం పొందిన వ్యక్తి ప్రణబ్ అని గుర్తు చేశారు. దశాబ్దాల తరబడి దేశానికి సేవ చేశారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. ఆయన సేవలు దేశం మరిచిపోదు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. భారత 13వ రాష్ట్రపతిగా దేశానికి సేవలందించి నిబద్ధత గల నాయకుడిగా పేరుగాంచారు. రాజకీయ వ్యవస్థపై చెరగని ముద్ర వేశారు. దేశ రాజకీయాలపై నిరంతర అధ్యయనం చేసేవారు. ఇందిరా, పీవీ, మన్మోహన్ సింగ్ లాంటి ప్రధానుల వద్ద ప్రణబ్ కీలకంగా వ్యవహరించారు. ఇందిరాగాంధీ నాయకత్వంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పీవీ హయాంలో ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా నియామకం అయ్యారు. ప్రణబ్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు దాని బ్జడెట్ పెంచారు. అలా ఆయన ఎన్నో పదవులు అలంకరించి.. రాష్ట్రపతిగా దేశానికి సేవలందించారు అని ఇంద్రకరణ్ రెడ్డి గుర్తు చేశారు. ప్రణబం÷–మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు అన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. ఆయన ఆదర్శాలు ఎప్పటికీ అనుసరణీయమని అన్నారు.

# కొత్త విద్యావిధానంలో ప్రభుత్వ జోక్యం ఉండదు

న్యూఢిల్లీ,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): కొత్త విద్యా విధానంలో ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. ఎడ్యుకేషన్ పాలసీలో ప్రభుత్వ జోక్యం, ప్రభావం చాలా తక్కువగా ఉండాలన్నారు. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ (ఎన్ఈపీ)పై నిర్వహించిన గవర్నర్ల కాన్ఫరెన్స్ సెషన్స్ ప్రారంభోత్సవంలో మోడీ ప్రసంగించారు. దేశ ఆకాంక్షలను నెరవేర్చడంలో విద్యా విధానంతోపాటు విద్యా వ్యవస్థ చాలా కీలకమవుతాయి. విద్యా వ్యవస్థ బాధ్యతల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు భాగస్వామ్యం అవుతాయి. విదేశీ విధానం, రక్షణ విధానాల మాదిరిగానే ఎడ్యుకేషన్ పాలసీ కూడా దేశానికి సంబంధించినదే కానీ ప్రభుత్వానిది కాదు. ఇది అందరిదని మోడీ పేర్కొన్నారు. అందుబాటులో అందరికీ నాణ్యమైన విద్య ప్రధాన లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన నూతన విద్యావిధానంలో ప్రభుత్వాల జోక్యం తక్కువగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. జాతీయ విద్యా విధానంపై అన్ని రాష్ట్రాల గవర్నర్లు, విద్యాశాఖ మంత్రులు, వైస్‌ఛాన్సలర్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దేశ ఆకాంక్షలను నెరవేర్చడానికి ముఖ్యమైన

**దేశ ఆకాంక్షలను నెరవేర్చడానికి ఆయుధం విద్య**

**భారత్ మరో 'జ్ఞాన ఆర్థిక వ్యవస్థ'గా మారడానికి దోహదపడుతుంది**

**నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ వర్చువల్ మీట్‌లో ప్రధాని మోడీ**

ఆయుధం విద్య అని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మన విద్యా విధానంలో గొప్ప మార్పులేవీ చోటు చేసుకోలేదు. దాంతో దేశంలో ఆసక్తి, సృజనాత్మకతల స్థానంలో మూక మనస్తత్వం అభివృద్ధి చెందింది. కానీ ఎన్ఈపీ విధానంలో అధ్యయనం చేయడానికి బదులు నేర్చుకోవడం, అభిరుచి, ప్రాక్టికాలిటీ అనే అంశాలుంటాయి. పాఠ్యాంశాల కంటే విమర్శనాత్మక ఆలోచనపై ఆధారపడి ఉంటుంది. 21వ శతాబ్దపు అవసరాలకు అనువైనదిగా తీర్చిదిద్దడంపై ఈ విధానం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఎప్పట్నుంచో ఉండే సమస్యలను పరిష్కరించి భారత్ మరో 'జ్ఞాన ఆర్థిక వ్యవస్థ' గా మారడానికి ఈ కొత్త విద్యావిధానం ఎంతో సహాయపడుతుందని' మోదీ వివరించారు.ఎలాంటి గజిబిజి లేకుండా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే లా విద్యను బోధించాలన్నారు. ప్రతి యూనివర్సిటీ, కాలేజీకి దశలవారీగా స్వయంప్రతిపత్తి కల్పిస్తామని మోదీ ప్రకటించారు. అంతేకాకుండా ఉత్తమ విద్యాసంస్థలకు రివార్డులు సైతం అందజేస్తామని వివరించారు. ఎన్ఈపీతో కొత్త ఆరోగ్యకర చర్చకు తెర లేచిందని, తద్వారా విద్యా విధానం మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. ఎన్ఈపీని విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. విద్యా వ్యవస్థలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుడుతూ నూతన విద్యావిధానం–2020 కేంద్రం ఆమోదించిన సంగతి తెలిసిందే. 34 సంవత్సరాల క్రితం నాటి జాతీయ విద్యా విధానం 1986 స్థానంలో ఇది రూపుదిద్దుకుంది. సామాజికంగా, ఆర్థికంగా అణగారిన వర్గాల వారిపై ఈ విధానంలో ప్రత్యేక దృష్టి పెట్టారు. నూతన జాతీయ విద్యా విధానంపై అన్ని రాష్ట్రాల గవర్నర్లు, విద్యాశాఖ మంత్రులు, వీసీలతో రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ మీట్ నిర్వహించారు. రోల్ ఆఫ్ ఎన్ఈపీ–2020 ట్రాన్స్ ఫార్మింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్' పేరిట ఈ కాన్ఫరెన్స్ జరిగింది.

# వీఆర్వో వ్యవస్థ రద్దు దిశగా ప్రభుత్వం అడుగులు

**ఈ సభలోనే కొత్త రెవెన్యూ చట్టం అమలుకు కసరత్తు**

**విర్వోల నుంచి రికార్డుల స్వాధీనానికి ఆదేశాలు**

**కలెక్టర్లను పురమాయించిన సిఎస్**

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): వీఆర్వో వ్యవస్థ రద్దుకు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. దీంతో వీఆర్వోల నుంచి రెవెన్యూ రికార్డులను స్వాధీనం చేసుకోవాలని.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం ఉదయం ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం 3 గంటల కల్లా రికార్డులు స్వాధీనం చేసుకుని..5 గంటల కల్లా రిపోర్ట్ పంపాలని సీఎస్ కలెక్టర్లకు ఆదేశించారు. కాగా రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ వ్యవస్థ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ప్రధానంగా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌వోల) వల్ల ప్రభుత్వం బద్‌నాం అవుతోందని ఆయన అన్నారు. రికార్డుల్లో పేర్లు చేర్చాలంటే డబ్బులు ఇవ్వక తప్పని పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థ బాగుపడాలంటే గ్రామ వ్యవస్థ రద్దు ఒకటే మార్గమని సీఎం స్పష్టం చేశారు. వీఆర్‌వోలను ఇతర శాఖల్లో కలిపేయాలన్నారు. రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు దిశగా ప్రభుత్వం యోచిస్తున్న సందర్భంగా కొత్త రెవెన్యూ చట్టాన్ని ఈ సమావేశాల్లోనే అమలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.పాలనలో ఇప్పటికే ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులేస్తోంది. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సాగుతున్న కేసీఆర్ సర్కార్ వీఆర్‌వో వ్యవస్థ రద్దుకు యోచిస్తున్నట్టుగా సమాచారం. రాష్ట్రంలోని వీఆర్‌వోల వద్దనున్న రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లుగా పభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏకపక్షంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలుకు తున్నాయి. కాగా, కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పన చేస్తున్నట్లు గత అసెంబ్లీ సమావేశాల్లోనే సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లోనే కొత్తచట్టాన్ని ప్రకటిస్తారని తెలిసింది. దానికి అనుగుణంగానే గ్రామాధికారుల వ్యవస్థ రద్దుకు అంతా సిద్ధం చేసినట్టుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే, వీఆర్వోలను ఉద్యోగాల నుంచి తొలగించకుండా వేరే శాఖలో సర్దుబాటు చేసే విధంగా సీఎం కేసీఆర్ ఇదివరకే అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లుగా తెలిసింది. గ్రామీణ ప్రాంతంలో రెవెన్యూ శాఖలో కీలకంగా వారికి ఉద్యోగ భద్రత సైతం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం.

# రామలింగారెడ్డికి అసెంబ్లీ ఘననివాళి

**సంతాప తీర్మానం ప్రవేశ పెడతానని అనుకోలేదు**

**ఉద్యమ నేపథ్యంలో ఎదిగి వచ్చిన నాయకుడు సోలిపేట**

**అసెంబ్లీలో నివాళి అర్పించిన సిఎం కెసిఆర్**

**అనుబంధాన్ని పంచుకున్న తోటి ఎమ్మెల్యేలు**

హైదరాబాద్,సెప్టెంబరు7 (ఆర్ఎన్ఎ): దివంగత దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డికి అసెంబ్లీ ఘనంగా నివాళి అర్పించింది. ఇటీవల అనారోగ్యంతో మరణించిన సోలిపేటను గుర్తు చేసేకుంటూ ఆయన సేవలను స్మరిస్తూ సభ సంతాపం ప్రకటించింది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి నిరాడంబర నాయకుడు అని, ఆయన ఎమ్మెల్యే కాక ముందే తనకు ఆయనతో ఆత్మీయ అనుబంధం ఉందని సీఎం కేసీఆర్ తెలిపారు. తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సభ్యులు తీరని బ్రాదను వ్యక్తం చేశారు. ఇటీవలే మరణించిన రామలింగారెడ్డి మృతిపట్ల తెలంగాణ శాసనసభలో సంతాప తీర్మానాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. బాధాకరమైన తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని తన ఊహకు కూడా లేకుండే. బాధాతప్త హృదయంతో ఈ తీర్మానం ప్రవేశపెడుతున్నానని అన్నారు. రామలింగారెడ్డి మృతిపట్ల ఈ సభ సంతాపం తెలుపుతోంది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. ఉద్యమ నేపథ్యంలో ఎదిగి వచ్చిన నాయకుడు సోలిపేట రామలింగారెడ్డి అని శ్లాఘించారు. నిత్యం ప్రజల మధ్యనే మనుగడ సాగించిన నిరాడంబరగా నేతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన ఆకస్మిక మరణం దుబ్బాక నియోజకవర్గం ప్రజలతో పాటు తెలంగాణ ప్రజల హృదయాలను కలిచివేసింది.సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సోలిపేట రామలింగారెడ్డి.. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. మెదక్ జిల్లాలో జరిగిన ఉద్యమాలకు బాసటగా నిలిచారు. జర్నలిస్టుగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారాల కోసం అనేక రాజీ లేని పోరాటాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాక ముందు నుంచే తనకు ఆయనతో ఆత్మీయ అనుబంధం ఉంది. తాను నమ్మిన ఆదర్శాలను ఆచరణలో పెట్టిన అభ్యుదయవాది. వరకట్నం లేకుండా పెళ్లి చేసుకున్నారు. కాళోజీ, తన చేతుల మీదుగా ఆదర్శ వివాహం జరిగింది. అదే విధంగా తన పిల్లలకు కూడా వివాహాలు జరిపించారు. ప్రభుత్వం ఇచ్చిన జర్నలిస్టు కాలనీలోఒక ఇల్లు కట్టుకుని నిరాడంబరంగా నివసించారని అన్నారు. రామలింగారెడ్డిలోని నిబద్ధత, విశ్వసనీయత, నాయకత్వ లక్షణాలు గమనించి.. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ తరపున టికెట్ ఇచ్చాం. ఆ ఎన్నికల్లో దొమ్మాట నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ తరపున గెలిచి యువ నాయకుడిగా శాసనసభలో అడుగుపెట్టారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. సమైక్యవాదులు కల్పించే ప్రలోభాలకు లొంగకుండా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఉద్యమ ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. 2014, 18 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గ ప్రజల సమస్యల కోసం పని చేసేవారు. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఆగస్టు 6న తుదిశ్వాస విడిచారు అని సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో రామలింగారెడ్డి లాంటి నాయకులు అరుదని మంత్రి కేటీఆర్ అన్నారు. కలం వీరుడిగా ఉద్యమానికి మద్దతునిచ్చిన వ్యక్తి రామలింగారెడ్డి అని పేర్కొన్నారు. రామలింగా రెడ్డిది గొప్ప వ్యక్తిత్వమని, నిరాడంబరమైన జీవన విధానంతో ఉండేవారని చెప్పారు. అందరితో కలుపుగోలుగా ఉండేవారని తెలిపారు. 2004లో జరిగిన ఎన్నికల సందర్భంగా దొమ్మాట నియోజకవర్గానికి రామలింగారెడ్డి అయితేనే న్యాయం చేస్తారని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ భావించారని, ఆ టికెట్ కోసం ఎంతోమంది ప్రయత్నించినప్పటికీ కేసీఆర్ పట్టుబట్టి రామలింగారెడ్డికే టికెట్ ఇచ్చారని వెల్లడించారు. తనతో ఆయన పరిచయంతో దుబ్బాక నియోజకవర్గానికి తీసుకుని వెళ్లి అక్కడి చేనేతల సమస్యలను ప్రస్తావించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కీలక పాత్ర పోషించారని మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. రామలింగారెడ్డి మృతిపట్ల శాసనసభలో సీఎం కేసీఆర్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి కొప్పుల మాట్లాడారు. రామలింగారెడ్డి లేరనే విషయం కంటతడి పెట్టించిందని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్యలోనే ఉండే నాయకుడు అకాల మరణం చెందడం బాధ కలిగించిందని అన్నారు. విద్యార్థి దశ నుంచే రామలింగారెడ్డి ఉద్యమాల్లో పాల్గొన్నారు. జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలు మరువలేనివి అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనపై అనేక కేసులు పెట్టారు. టాడా కేసులో మూడు నెలల పాటు రామలింగారెడ్డి జైలు శిక్ష అనుభవించారు. కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా ఆయన ముందుండే వారు అని మంత్రి గుర్తు చేశారు. వామపక్ష భావాలతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారని అన్నారు. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అభ్యుదయ భావాలకు ఆదర్శశీలి అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోలిపేట సంతాప తీర్మానం సభలో ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. ఇది దురదృష్టకరం.. బాధాకరం అని ఆమె అన్నారు. సోలిపేట మరణ వార్త అందరినీ కుంగదీసింది. అభ్యుదయ భావాలను ఆచరణలో పెట్టిన వ్యక్తి సోలిపేట. అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. జర్నలిస్టుగా సేవలందించారు. 2002లో తనతో పరిచయం ఏర్పడింది. సిద్దిపేట నుంచి వరంగల్‌కు నిర్వహించిన సైకిల్ యాత్రలో కేసీఆర్ తో పాటు తాను పాల్గొన్నా. నాడు తన వార్తను సోలిపేట రాశారు. 2004లో ఇద్దరం కలిసి శాసనసభలో అడుగుపెట్టాం. ఇద్దరిది ఒకే జిల్లా కాబట్టి.. అనేక సందర్భాల్లో ఇద్దరం కలిసి ఉద్యమంలో పని చేశాం. ధైర్యవంతమైన రాజకీయ నాయకుడు సోలిపేట రామలింగారెడ్డి మన మధ్యలో లేకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఉద్యమ ప్రస్థానంలో రామలింగారెడ్డి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. సోలిపేట ఆత్మకు శాంతి చేకూరాలని ప్రారిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు పద్మా దేవేందర్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంఐఎం ఎమ్మెల్యే ఖాషా పాద్రి, మల్లు భట్టి విక్రమార్కలు ఆయన మృతికి సంతాపం పలికారు. తోటి సభ్యుడి అకాల మరణం కలచి వేసిందన్నారు. ఆయన మృతికి కటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



గాయని "ఆశాభోస్లే"
కోయిలయై చలనచిత్రకోటయిలానన్
నాయికలకు జీవమొసగె
ఆయని కంఠమ్ము బాధ తేజస్వినియై

(సెప్టెంబర్ 8 ఆశాభోస్లే జననం..)



–రాధశ్రీ
సెల్: 9494481210

# తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం

**నేటి నుంచి అన్ని రిజిస్ట్రేషన్ల నిలిపివేత**

**ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం**

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి రాష్ట్రంలో అన్ని రిజిస్ట్రేషన్లు బంద్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. కొత్త రెవెన్యూ చట్టం రానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. కేబినెట్ భేటీలో నూతన రెవెన్యూ చట్టానికి మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. ఇక ముందు నుంచీ అనుకుంటున్నట్టుగా గ్రామ అధికారుల వ్యవస్థ రద్దు దిశగా కేసీఆర్ సర్కార్ యోచిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంతో తెలంగాణలోని రిజిస్ట్రేషన్ల శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మంగళవారం నుంచి సెలవులు వర్తిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సెలవులు ప్రకటించింది. స్టాంపుల కొనుగోలు, చలాన్లు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్లు అవుతాయని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్ చిరంజీవులు ప్రకటించారు. మంగళవారం నుంచి మాత్రం స్టాంపుల విక్రయాలు పూర్తిగా నిలిపివేశామని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో మంగళవారం నుంచి పూర్తిగా రిజిస్ట్రేషన్లు ఆగిపోతాయని పేర్కొన్నారు. కొత్త రెవెన్యూ చట్టం దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశామని చిరంజీవులు తెలిపారు.



అంబర్‌పేట శ్మశాన వాటికను ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలసి సందర్శించిన హైదరాబాద్ మేయర్ బొతు రామ్మోహన్

# శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి

**అంబర్‌పేట వాటికను సందర్శించిన మేయర్**

హైదరాబాద్,సెప్టెంబరు7 (ఆర్ఎన్ఎ): శ్మశాన వాటికల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. అంబర్‌పేట లోని హర్రస్ పెంట శ్మశాన వాటికను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, జీహెచ్ ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం వైకుంఠధామాలతో పేరుతో గ్రామాల్లో కూడా శ్మశాన వాటికలు నిర్మిస్తుందని గుర్తు చేశారు. అంబర్ పేటలోని శ్మశాన వాటికలో పార్కింగ్, స్నానాల గదుల నిర్మాణం, మొక్కల పెంపకం ఇలా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఖర్చు ఎంతైనా వెనుకాడబోమని మేయర్ పేర్కొన్నారు.

# రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): రాత్రిళ్లు ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఆవుల కిరణ్ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని సైబరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. గత 7సంవత్సరాల నుంచి 90 కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవల ఖమ్మం పోలీసులకు చిక్కి జైలుకు వెళ్ళాడు. జూలైలో విడుదల అయిన నిందితుడు మళ్ళీ దొంగతనాలకు పాల్పడటం మొదలు పెట్టాడు. రెక్కీ నిర్వహించి చోరి చేయడం అతని నైజం అని తెలిపారు. నంబర్ ప్లేట్ లేని వాహనం, నల్ల హెల్మెట్ వాడుతూ చోరీలు చేస్తున్నట్లు పోలీసుల వెల్లడించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.16.70 లక్షల విలువ చేసే 390గ్రాముల బంగారం, 829 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు ఉన్నారు. మరో 60తులాల బంగారం రికవరీ చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# ఏజెన్సీ అడవుల్లో మళ్లీ అలజడి

నేటినిజం

మంగళవారం 8-9-2020

ఏజెన్సీ అడవుల్లో మళ్లీ అలజడి మొదలయ్యింది. ఏమవుతుందో అన్న అనుమానాల నేపథ్యంలో డిజిపి మహేందర్ రెడ్డి పర్యటన జరిగింది. అప్పుడే భద్రాద్రి జిల్లాలో ఓ ఎన్‌కౌంటర్‌లో మావోను లేపేశారు. ఇంతకాలం ప్రశాంతంగా ఉన్న అడవుల్లో మళ్లీ అలజడి కారణంగా గిరిజనాల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోలు తాలిపేరు వద్ద రోడ్డును పేల్చేశారు. ఈ మేరకు ఓ లేఖను వదిలారు. దీనికితోడు గణపతి తదితర లొంగుబాట్లపై అనేకానేక వార్తలు షికారు చేశాయి. వీటిని మావోలు కూడా ఖండించారు. ఈ దశలో రెండోసారి మూడ్రోజులుగా అడవుల్లో మకాం వేసిన డిజిపి ఆంతర్యం ఏమయివుంటుందన్న చర్చ సాగుతోంది. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత గిరిజన సమస్యలు మూలకు పోయాయి. గిరిజన గ్రామాల్లో విద్యవైద్యం యధావిధిగానే ఉంది. రవాణా సౌకర్యలు మెరుగు పడలేదు. పోడు భూమలు సమస్యలు తేలలేదు. సరికదా పోడు భూములను లాక్కుంటున్నారని ఆందోళనకు దిగారు. గిరిజనుల్లో వర్గాకరణ చేపట్టాలని, మైదానప్రాంత గిరిజనులు తమ హక్కులను కాలరాస్తూ తమ నోటికాడ ముద్దను కొల్లగొడుతున్నారని అంటున్నారు. ఇలాంటి అనేక సమస్యలకు తెలంగాణ ఏర్పడ్డ తరవాత పరిష్కారం అవుతాయని భావించినా వాటిగురించి పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ దశలో గిరిజనుల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవాలని మావోలు ఎత్తులు వేస్తున్నారన్న సమాచారం పోలీసుకు చిక్కింది. మొత్తంగా వ్యవహారం కాస్తా ఇప్పుడు అడవుల్లో అలజడికి కారణంగా భావించాలి. ఖమ్మం,ఆదిలాబాద్,వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీలో పోలీసులు మోహరించి పెద్ద ఎత్తున కూంబింగ్ చేపట్టారు. మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు, కమాండర్ దూది దేవాలు అలియాస్ శంకర్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపాక మరోమారు ఏజెన్సీలో ఉద్రిక్తత నెలకొంది. మావోయిస్టు నేత భాస్కర్ డైరీ పోలీసులకు చిక్కినట్లు తెలుస్తుండగా, అందులోని విషయాలు పోలీసులకు సవాలుగా మారాయి. జిల్లాలో మా వోయిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు అమలు చేయాల్సిన ప్రణాళికల గురించి ఆ డైరీలో ఉన్నట్లు సమాచారం. మావోయిస్టులకు ప్రధాన షెల్టర్‌గా ఉన్న తిర్యాణి, మంచిర్యాల జిల్లా అటవీ ప్రాంతంలో అడుగడుగునా జల్లెడ పడుతున్నారు. ప్రాణహిత పరీవాహక ప్రాంతాలైన చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూర్ అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలు గాలిస్తున్నా యి. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ గ్రామాల ప్రజలను పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయితే డిజిపి మకాం వేయడంపైనే అనుమానాలు ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలోని అధికార పార్టీ నేతలను, ప్రజా ప్రతినిధులను అలర్ట్ చేశారు. ఊహించినట్లే మావోయిస్టు బంద్ ప్రభావం లేకపోవటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బంద్ దృష్ట్యా ముందస్తుగా ఏజెన్సీని జల్లెడ పడుతుండటంతో ఎక్కడ ఏం జరుగుతుందోనని గిరిజన గూడెంలలో భయాందోళనలు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా ఎన్‌కౌంటర్‌లో కీలక నేతను కోల్పోయిన మావోయిస్టులు జాగ్రత్తలతో ఉంటారని, పక్కా సమాచారంతోనే పోలీసులకు దొరికే చాన్స్ ఉంటుందని కొంతమంది అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అడవులు దట్టంగా పెరగటం, అంతటా నీరు లభిస్తుండటం మావోయిస్టులు సునాయసంగా తప్పించుకునే అవకాశం ఉంటుందని ఇతర విప్లవ గ్రూపులు పేర్కొంటున్నాయి. ఈ నేథ్యంలోనే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మావోయిస్టుల కోసం కూంబింగ్ ముమ్మరంగా కొనసాగుతున్నది. మావోయిస్టుల సంచారం ఉందన్న నేపథ్యంలో నాలుగు రోజులుగా జిల్లాలోనే మకాం వేసిన డీజీపీ మహేందర్‌రెడ్డి పోలీసులతో నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహించడం చూస్తుంటే అంతకు మించి ..ఇంకేమైనా ఉందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. లేకుంటా వరుసగా రెండుసార్లు ఆయన అడవుల్లో మకాం ఎందుకు వేస్తారన్నది ఆలోచించాలి. డిజిపి ఎప్పటికప్పుడు పోలీసులకు మార్గదర్శనం చేస్తూ కూంబింగ్ విషయాలను స్వయంగా పర్యవేక్షించారు. జిల్లాలోని మారు మూల అటవీ ప్రాంతాలు, ప్రాణహిత సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్‌తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియడం లేదు. మావోయిస్టు ప్రాబల్యం అధికంగా ఉన్న తిర్యాణి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి డీజీపీ ఆకస్మికంగా సందర్శించడం, పోలీసులను ఎప్పటికప్పుడు అలర్ట్ చేయడంతో పాటు వారిలో మనోధైర్యాన్ని నింపుతూ జిల్లాలోని అడవుల్లో అడుగడుగునా జల్లెడపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు అడెల్లు అలియాస్ భాస్కర్ బృందం మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో సంచరిస్తున్నదనే సమాచారం మేరకు స్వయంగా డీజీపీ మహేందర్‌రెడ్డి రంగంలోకి దిగినట్లు తెలుస్తున్నది. ఆసిఫాబాద్‌లో ఆయన మూడు రోజులుగా మకాం వేసి కూంబింగ్‌ను స్వయంగా పర్యవేక్షించారు. తెలంగాణ ఏర్పడక ముందు అంతోఇంతో ప్రభావం ఉన్న మావోల వ్యవహారం తెలంగాణ ఏర్పడ్డ తరవాత అస్సలు కానరాలేదు. మధ్యలో ఓ ఎన్నకకౌంటర్ జరిగింది. తాజాగా ఇప్పుడు మరో ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే తెలంగాణ ఏర్పడ్డ తరవాత ప్రజల్లో ముఖ్యంగా గిరిజనుల్లో కూడా సంతృప్తి లేదు. వారి సమస్యలు గతం కన్నా హీనంగా ఉన్నాయి. పోడుభూమలు సమస్యలకు పరిష్కారం లేదు. వైద్యం దరిచేరడం లేదు. అలాగే రవాణా సౌకర్యాలు మెరుగుపడలేదు. ఈ దశలో గిరిజనుల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని మావోలు ఎత్తుగడ వేసి ఉండవచ్చు. ఈ సమస్యలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్ట ఇసారించడం లేదు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోకుండా ఎన్‌కౌంటర్లతో మట్టు పెట్టాలన్న పోలీసుల ఆలోచనలు సరికాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏమేమి హామీలు ఇచ్చామో..అవి ఏ మేరకు నెరవేర్చామన్నది పాలకులు పరిశీలన చేసుకోవాలి. అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న ప్రత్యేక బలగాల కూంబింగ్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. జిల్లాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. ఈ దశలో గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించే ప్రయత్నం చేయడం ద్వారా మావోల రాకను అడ్డుకోవచ్చు.

## అద్దె బస్సుల యజమానులను ఆదుకోవాలి

### ఎమ్మెల్యేను కలిసిన విన్నవించిన నేతలు

### సిఎంతో చర్చిస్తానన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్,సెప్టెంబరు7 (ఆర్‌ఎన్‌ఎ): కొవిడ్ కారణంగా గత ఐదు నెలలుగా నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులను పునరుద్ధరించేందుకు చర్యలు తీ సుకోవాలని కోరుతూ సంబంధిత యజమానులు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి నతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకుని వెళతమాని అన్నారు. అయితే కోవిడ్ నిబంధనల మేరకు సిఎం నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసనసభ సమావేశాల్లో తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గత కొన్నేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న తాము కరోనా లాక్‌డౌన్ కారణంగా బస్సులు నిలిచి పోవడంతో నెలవారీ అద్దెను చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. ఇదే సందర్భంలో ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి పల్లెకు బస్సును నడిపి ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే జోగు రామన్న ఆర్టీసీ డీఎం జనార్దన్‌కు సూచించారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎంగా బాధ్యతలు జనార్ధన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలకు తెలంగాణ ప్రభుత్వంలోనే

రోడ్డు సౌక ర్యం కలిగిందని, ప్రతి పల్లెకు బస్సును నడిపి ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

## అంతర్వేది రథం దగ్ధంపై అనుమానాలు

### -సమగ్ర విచారణ జరపాలన్న ఎంపి రఘురామ

రాజమండ్రి,సెప్టెంబరు7 (ఆర్‌ఎన్‌ఎ): సఖినేటిపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి రథం అగ్నికి ఆహుతి అయిన సంఘటనతో దేవస్థానం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దేవస్థానంకు సంబంధించిన సీసీ కెమరాలు పనిచేయక పోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ ఈవోను సస్పెండ్ చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు ఆందోళన చేపట్టారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి రథం కాలిపోయిన విధానం చూస్తుంటే కుట్ర ప్రకారమే జరిగినట్లు అనుమానంగా ఉందని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. ఈ ఘటనపై సీఎం జగన్ స్వయంగా స్పందించాలన్నారు. దీన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన చర్యగా వదిలేయకుండా డీజీపీతో ప్రత్యక్షంగా మాట్లాడాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంతర్వేదిలో క్రీ.పూ. 300 సమయంలో నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి చెందిన ఊరేగింపు రథం అగ్నికి ఆహుతి కావడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రథం కాలిపోయిన విధానాన్ని నిశితంగా పరిశీలిస్తే, ఈ అనుమానం కలుగుతోందని అన్నారు. కింది నుంచి పైదాకా ఒకేసారి ఈ రథం తగులబడడం అనుమానాస్పదంగా ఉందని చెప్పారు. ఒకవేళ కరెంటు షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటే ఈ రకంగా రథం పూర్తిగా బూడిదయ్యే అవకాశం లేదన్నారు. గతంలో కొన్ని చోట్ల ఇలాగే జరిగితే ఎవరో పిచ్చివాళ్లు చేశారని ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా ఎవరో పిచ్చివారి పిచ్చిచేష్ట గానే ముద్రవేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. ఈ ఘటన చూస్తుంటే... కావాలని ఒక మతంపై జరిగిన దాడిలా అనిపిస్తోంది. మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కేవలం ప్రకటనతోనే సరిపెట్టుకోకుండా దోషులను పట్టుకుని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏడాదికొకసారి జరిగే రథోత్సవంలో వేల మంది భక్తులు పాల్గొంటారని గుర్తు చేశారు. హిందువుల విశ్వాసాలను దెబ్బతీయడం ఎవరికైనా మంచిది కాదన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, డీజీపీతో మాట్లాడి ఈ దుర్ఘటనపై విచారణ జరిపించాలని, నిందితులు ఎవరైనా, ఏ మతస్థులైనా, ఏ కులస్థుడైనా పట్టుకుని కఠినంగా శిక్షించాలని భక్తుల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.

## చరిత్రలో నిలిచిపోయిన కేవానంద భారతి కేసు

### పలు సందర్భాల్లో ఉదాహరణగా నిలిచిన ఉదంతం

న్యూఢిల్లీ,సెప్టెంబరు7 (ఆర్‌ఎన్‌ఎ): రాజ్యాంగ మౌళిక సూత్రాలను ప్రశ్నించిన కేసుగా కేశవానంద భారతి కేసు చరిత్రలో నిలుస్తుంది. కేశవానంద భారతి ఆధ్యాత్మికవేత్తగా కాక రాజ్యాంగపరమైన హక్కుల కోసం చేసిన న్యాయపోరాటంతోనే దేశవ్యాప్త గుర్తింపు పొందారు. పలు సందర్భాల్లో ఈ కేసును ఉదహరిస్తారు.

కేరళ ఆధ్యాత్మిక గురువు కేశవానంద భారతి శ్రీపాద గల్వరు(79) ఆదివారం కన్నుమూశారు. కేరళలో కాసర్‌గోడ్‌లోని ఎడనీర్ మఠ్‌లో అనారోగ్యంతో ఉదయం 3.30 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచినట్టు పోలీసులు తెలిపారు. ఆయన వయస్సు 79 ఏండ్లు. ఆయన మృతిపట్ల ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు సంతాపం ప్రకటించారు. 1969లో కేరళ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ సంస్కరణల్లో భాగంగా తమ మఠం ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ, హక్కుల సాధనకై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 24, 25, 26, 29 రాజ్యాంగ సవరణలు ప్రాథమిక హక్కులను దెబ్బతీస్తున్నాయని వాదించారు. ఈ కేసు 'కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'గా ప్రసిద్ధి చెందింది. అప్పట్లో ఈ కేసును 13 మంది న్యాయమూర్తులతో విస్తృత ధర్మాసనం సుదీర్ఘంగా 68 రోజుల పాటు విచారించింది. ఇదొక రికార్డు. 'రాజ్యాంగానికి యథేచ్ఛగా సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు లేదని 1973 ఏప్రిల్ 24న ఈ కేసు తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలిగితే కోర్టులు జోక్యం చేసుకోవచ్చునని తీర్పునిచ్చింది. తద్వారా సుప్రీం కోర్టు రాజ్యాంగ మౌలిక సూత్రాల పరిరక్షకురాలిగా ఉంటుందని తెలిపింది. కానీ ఈ కేసుకు సంబంధించి మఠం భూముల విషయంలో కేశవానంద భారతికి చుక్కెదురైంది. భూసంస్కరణలను సుప్రీం కోర్టు సమర్థించింది.

## అనంతపురంలో రోడ్డు ప్రమాదం

### -ముగ్గురు యువకుల దుర్మరణం

అనంతపురం,సెప్టెంబరు7 (ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని రాయదుర్గం మండలం కదరంపల్లి సమీపంలో సోమవారం ఘో రోడ్డు ప్రమాదంజరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలిలో ముగ్గురు ప్రాణాలు విడిచారు. మృతులు కృష్ణ, సురేష్, సిద్ధన గౌడ్‌గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలిలో ముగ్గురు ప్రాణాలు విడిచారు. మృతులు కృష్ణ, సురేష్, సిద్ధన గౌడ్‌గా గుర్తించారు.

# కానరాని మావోల బంద్ ప్రభావం

### అయినా అప్రమత్తంగానే పోలీసులు

### కొనసాగిన కూంబింగ్..రహదారుల రక్షణ చర్యలు

భద్రాచలం,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): జిల్లా వ్యాప్తంగా పలు ప్రధాన రహదారుల మీద దృష్టి కేంద్రీకరించిన పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేశారు. మావోయిస్టు బంద్ దృష్ట్యా ఏజెన్సీలో ప్రత్యేక బలగాలను మోహరింపజేసి కూంబింగ్ చేపట్టారు. స్పెషల్ పార్టీ బలగాలతో పాటు ఈ దఫా గ్రేహౌండ్స్ దళాలతో సరిహద్దు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన బంద్ ఇల్లెందు ఏరియాలో ఆదివారం కనిపించలేదు. జిల్లావ్యాప్తంగా ఇల్లెందు, గుండాల, మణుగూరు భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, బయ్యారం, టేకులపల్లి, ఆళ్లపల్లి, కరకగూడెం, పినపాక లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా బంద్ ప్రభావం కనిపించలేదు. దుకాణాలు, షాపులు, వ్యాపార, వాణిజ్యసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వని చేశాయి. గుండాల, కరకగూడెం లాంటి మారుమూల గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్ సర్వీసులను ముందస్తుగా నిలిపి వేశారు. ఈ నెల3వ తేదీన తెల్లారుజామున భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబా బాద్ జిల్లాల సరిహద్దు దేవాళ్లగూడెం,దుబ్బగూడెం మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దూది దేవాలు అలియాస్ శంకర్ ఏరియా కమిటీ సభ్యుడు, కమాండర్ స్థాయిలో ఉన్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. సుమారు ఏడేళ్ల క్రితం పార్టీలోకి వచ్చిన శంకర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా హరిభూషణ్ అలియాస్ జగన్‌కు అంగరక్షకుడుగా కూడా ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఏరియా కమిటీ సభ్యుడుగా, దళనేత శంకర్ బయటకు రావటం, పోలీసులకు చిక్కి ఎన్‌కౌంటర్‌లో హతమవ్వటం మావోయిస్టులు ప్రతీకారం తీర్చుకునేందుకు దుశ్చర్యకు పాల్పడే అవకాశం ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. బలగాలను పెద్ద ఎత్తున మోహరించి కూంబింగ్‌ను ఉధృతం చేశారు. ఇదే క్రమంలో ఆదివారం తెల్లారుజామున గుండాల మండలం శంభునిగూడెం ఏరియాలో ఎనిమిది రౌండ్ల వరకు కాల్పుల శబ్దాలు వినిపించినట్లు ప్రచారం జరిగింది. కానీ అక్కడి గ్రామాల ప్రజలు, పోలీసులు కేవలం ప్రచారం మాత్రమేనని కొట్టిపడేశారు. దూది దేవాలు 2013లో మావోయిస్టు పార్టీలో చేరాడని మావోయిస్టు పార్టీ ప్రకటించగా వైద్యం కోసం వెళ్లి దొరికినట్లు వెల్లడించిన మావోయిస్టులు ఏ పట్టణానికి వెళ్లింది, ఎక్కడ పోలీసులకు చిక్కింది వెల్లడించలేదు. అయితే మునుపెన్నడూ లేనంతగా మావోయిస్టు కమిటీల పేరుతో ప్రకటనలు గుప్పించి బంద్‌కు పిలుపునిచ్చిందని, ఉనికిని చాటుకునే యత్నం చేసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ డైరీలో దొరికిన సమాచారాన్ని పూర్తిగా విశ్లేషిస్తున్న పోలీసులు.. వాటి ఆధారంగా మావోయిస్టులకు సహకరిస్తున్న, వారికి ఆశ్రయం కల్పిస్తున్న వారిపై నిఘా పెంచినట్లు తెలుస్తున్నది. జిల్లాలో మవోయిస్టుల కోసం ముమ్మరంగా వేట కొనసాగుతున్న సమయంలో జిల్లాలోని నలుగురు ఎస్‌ఐలను రామగుండం సీపీ సత్యనారాయణ బదిలీ చేశారు. కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌ఐ వరికుమార్‌ను సిర్పూర్(టి) పీఎస్‌కు, వరంగల్ కమిషనరేట్ నుంచి సందీప్‌కుమార్‌ను చింతలమానేపల్లి పీఎస్‌కు, చింతల మానేపల్లి పీఎస్ నుంచి రాంమోహన్‌ను కాగజ్‌నగర్ రూరల్ పీఎస్‌కు బదిలీ చేశారు. కాగా, మవోయిస్టులను పట్టుకోవడమో లేక లొంగిపోయేలా చర్యలు తీసుకోవడమో లక్ష్యంగా డీజీపీ జిల్లాలోనే మకాం వేసినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే తిర్యా ణి అడవుల్లో అడెల్లు టీం సభ్యులు రెండుసార్లు పోలీసులకు ఎదురుపడి తృటిలో తప్పించుకున్నట్లు భావిస్తున్నారు.

డీజీపీ మహేందర్‌రెడ్డి, రామగుండం సీపీ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సత్యనారాయణ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ బీఎల్‌ఎన్ స్వామి ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్ మండలంలోని ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చేపట్టిన ఎలాంటి ఆనవాళ్లు కానరాలేదు. మొత్తంగా గిరిజన గూడాల్లో మళ్లీ పోలీసులు దృష్టి సారించారు. జూలైలో తిర్యాణి మండలం టెక్కిగూడేల్లో మావోయిస్టులు, కూంబింగ్ దళాలకు ఎదురుపడిన సంఘటన మినహా జిల్లాలో మరెక్కడా మావోయిస్టుల జాడలున్నట్లు గుర్తించలేదు. అయినప్పటికీ భాస్కర్ బృందం జిల్లాలో సంచరిస్తున్నదని భావిస్తున్న పోలీసులు, వారి కోసం తీవ్రంగా గాలింపులు చేపడుతున్నారు. జిల్లాలో మావోయిస్టుల కోసం పోలీసు బలగాలు వేట సాగిస్తున్నాయి. గిరిజన గ్రామాలైన జిల్లేడ, మొరలీగూడ, నందీం గాం, కమ్మర్‌గాం తదితర గ్రామాల్లో డీఎస్పీ స్వామి యువకులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనుమానితులెవరైనా కనిపిస్తే సమాచారమివ్వాలని కోరారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పోలీ సులు పలువురు మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్లు వేశారు. జనజీవన స్రవంతిలో కలవాలని అందులో పొందుపరిచారు. మండలంలోని సోనాపూర్, గుట్రావ్‌పల్లి, వెంకటాపూర్ ఆదివా సీ గ్రామాలు. ఈ శివారు అటవీ ప్రాంతం ఆసిఫా బాద్ జిల్లా తిర్యాణి అడవితో కలిసి ఉంటాయి. గతంలో ఇక్కడ ఎదురుకాల్పులు జరిగాయి. డీజీపీ మహేందర్ రెడ్డి పర్యటన సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

# ఆన్‌లైన్ క్లాసులతో ఆర్థిక కష్టాలు

### స్మార్ట్ ఫోన్, ట్యాబ్‌ల, టీవీల కోసం పిల్లల పట్టు

### కొనివ్వలేక తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): కరోనా కష్టకాలంలో కుటుంబం గడువడమే గగనంగా ఉన్న పరిస్థితుల్లో ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ పేద,మధ్య తరగతి ప్రజలకు గుదిబండగా మారింది. రెండు నెలల నుంచి ప్రైవేట్ పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులు బోధిస్తున్నాయి. పూర్తిస్థాయిలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఈనెల నుంచి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభవయ్యాయి. వీరంతా సెల్‌ఫోన్లలోనే పాఠాలు వినాలి. ఒక ఇంట్లో ఇద్దరు విద్యార్థులు ఉంటే వారిద్దరికీ సెల్‌ఫోన్స్ కోసం రూ.20 వేల నుంచి రూ.30 వేలు ఖర్చు చేయాలి. నెట్ కోసం రూ.500 చొప్పున బ్యాలెన్స్ వేయించాలి. పుస్తకాలు, ఫీజులు ఇలా రూ.50 వేల రూపాయలకుపైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కార్పొరేట్ స్కూల్ విద్యార్థుల కోసం ఏకంగా రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చు చేసి లాప్‌ట్యాప్‌లు కొనుగోలు చేస్తున్నారు. ఇకపోతేసెల్‌ఫోన్‌లో క్లాసులు వినే విద్యార్థుల కళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తలనొప్పితోపాటు ఇతర సైడ్ ఎఫెక్ట్స్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య సమస్యలు ఒక ఎత్తు అయితే ఆర్థికకష్టాలు తలనొప్పిగా మారాయి. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వసూళ్లు మొదలయ్యాయి. ఇన్నాళ్లు ఆన్‌లైన్ క్లాసులు బోధిస్తున్న కొన్ని స్కూళ్లు ఫీజులు వసూలు చేయగా, మరికొన్ని స్కూళు వసూలు చేయలేదు. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. అయినా వసూళ్లు జరుగుతున్నాయి. ఈనెల 1 నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు ప్రారంభమయినా బాలారిష్టాలు తొలగడం లేదు. సరికదా విద్యార్థుల్లో టెన్షన్ మొదలయ్యింది. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటికే క్లాసులు జరుగుతున్నాయి. అయితే ప్రతీ విద్యార్థికి సెల్‌ఫోన్, ట్యాబ్ తప్పనిసరైంది. వీటితోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, ఫీజులు తడిసిమోపెడవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు వింటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు మొదలు కాగా టీవీల ద్వారా వీక్షిస్తున్నారు. 23 శాతం మందికి టీవీలు అందుబాటులో లేవు. సెల్‌ఫోన్స్ లేవు. దీంతో వీరంతా పక్కిళ్లకు వెళ్లి క్లాసులు చూస్తున్నారు. అయితే టీవీలు లేని తల్లిదండ్రులు పిల్లల కోసం టీవీల కొనుగోలు గురించి ఆలోచిస్తున్నారు. కేబుల్ కనెక్షన్ లేనివారు కొత్తగా కనెక్షన్ తీసుకుంటున్నారు. వ్యవసాయ పనులు సీజన్‌లో తరగతులు ప్రారంభం కావడంతో అదనంగా ఆర్థిక భారం పడుతోందని పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని కార్పొరేట్ స్కూళ్లు పదో తరగతి వి ద్యార్థి నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్నాయి. వివిధరకాల పేర్లతో ఉన్న స్కూళ్లల్లోనూ లక్ష రూపాయల వరకు ఫీజులు ఉన్నాయి. ఎల్‌కేజీ, యూకేజీ చదివే విద్యార్థుల నుంచే రూ.20 వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అయితే కరోనా ప్రభావం పూర్తిగా ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయడంతో ఇన్నాళ్లు ప్రైవేట్ పాఠశాలల్లో చదివించిన వారు మళ్లీ ప్రభుత్వ పాఠశాలకు పంపించలేక ఉన్న ఆభరణాలు, ఆస్తులు విక్రయించి ఫీజులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆన్‌లైన్ క్లాసులు మొదలు కాగా ఉపాధ్యాయులు క్లాస్ ప్రారంభానికి ముందు, తరువాత ఫోన్ చేయాల్సి వస్తుంది. క్లాస్ టీచర్‌తోపాటు సబ్జెక్ట్ టీచర్ చేస్తున్నారు. దీనితో విద్యార్థులు సైతం విసుక్కోవాల్సిన పరి స్థితి. విద్యార్థుల ఫోన్లు ఎక్కువగా వారి తల్లిదండ్రుల వద్ద ఉంటాయి. వారు ఏదో పనిలో ఉంటున్నారు. విద్యార్థుల ఫోన్స్ అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయులు ఒకటికి నాలుగుసార్లు ఫోన్ చేస్తున్న పరిస్థితి. పిల్లలకు ప్రత్యేకంగా సెల్‌ఫోన్

లేకపోవడంతో ఆన్‌లైన్ క్లాసులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాల్లో ఆన్‌లైన్ తరగతుల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను పర్యటిస్తూ ఆన్‌లైన్ తరగతులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీస్తున్నారు. చాలా మంది విద్యార్థులు తమ ఇళ్లల్లో స్మార్ట్‌ఫోన్, నెట్ కనెక్షన్, టీవీలు లేవని సమాధానం చెబుతుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.




కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో షాపూర్ నగర్‌లో పేషెంట్లకు కిట్లను అందచేసిన మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద కూడా ఉన్నారు.

## ప్రణాళిక ప్రకారం ఆన్‌లైన్ విద్య: కలెక్టర్

ఖమ్మం,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): ప్రణాళిక ప్రకారం ఆన్‌లైన్ విద్యాబోధన చేపట్టాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల విద్యాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో చర్చించి వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 1,329 ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకు 74,042 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ బోధన అందేలా చూడాలన్నారు. డీటీహెచ్, టీవీ, సెల్‌ఫోన్లకు ఇంటర్నెట్ కనెక్షన్లను సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న మండలాల్లో పాఠశాలలతోపాటు వసతి గృహాల విద్యార్థులకు సమగ్ర కార్యాచరణతో బోధన జరగాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులకు సంబంధించి సబ్జెక్టుల వారీగా టీచర్ల సెల్ నంబర్లు తప్పనిసరిగా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆన్‌లైన్ తరగతుల షెడ్యూల్‌ను ప్రతి పాఠశాల, గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ప్రసార మాధ్యమాల సదుపాయం లేని వారి కోసం పాఠశాల, గ్రామ పంచాయతీల్లో టీవీలను సమకూర్చి సీనియర్ విద్యార్థులతో సమన్వయ పర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల విద్యార్థుల కోసం తీసుకున్న చర్యలపై సూచనలు చేశారు. పాఠశాల విద్యార్థులకు దూరదర్శన్, టీ శాట్, ద్వారా చేపడుతున్న ఆన్‌లైన్ తరగతులను టైం టేబుల్ ప్రకారం ప్రధానోపా ధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్లు నిర్వహించాలన్నారు. విద్యార్థుల సంఖ్యనుబట్టి ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు.

## మిద్దె తోటలపై గృహిణుల ఆసక్తి

### -ఆకుకూరల పెంపకంతో పాటు ఆహ్లాదకర వాతావరణం

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): ఇటీవల మిద్దె తోటలకు ఆదరణ పెరుగుతోంది. ఉద్యానశాఖ కూడా మిద్దెలపై తోటలు పెంచే వారిని ప్రోత్సహిస్తున్నారు. నటి సమంత కూడా దీనిపై ప్రచారం చేపట్టారు. సాధారణంగా ఇంట్లో మిద్దెలను ఆహ్లాదంతో పాటు కూరగయాల పెంపకానికి ఉపయోగించుకోవచ్చు. వివిధ ప్రాంతాల్లో ఇప్పుడు ఇవి బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. గజ్వెల్‌లో లాయర్ రమణ సతీమణి విజయ, బోడుప్పల్‌లో శోభారాణిలు ఈ రకమైన మిద్దె తోటలతో ఆహ్లాదాన్ని వచ్చేలా చేసుకున్నారు. సేంద్రియ పద్దతిలో ఎరువులను తయారు చేసుకుని అందరితో ఔరా అనిపించుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లలబావి సమీపంలో నల్లపాటి శ్రీధర్‌కు చెందిన ఇల్లు నందనవనంలా కన్పిస్తుంది. తొట్లలో మట్టిని నింపి కూరగాయలు, ఆకుకూరలు, పూలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ఇంటిలోని వంటగది వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేసి మొక్కలపై పిచికారీ చేస్తూ ఆరోగ్యకరమైన పంటలను పండిస్తున్నారు. మిద్దెపై దాదాపు 200 మొక్కలకు డ్రిప్ సిస్టం ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. బోన్సాయ్, కొత్త రకం ద్రాక్ష మొక్కలు కూడా పెంచుతున్నారు. రోజూ 2 గంటలు మొక్కల సంరక్షణకు కేటాయిస్తూ గృహిణులకు ప్రేరణగా నిలుస్తున్నారు. ఇంటి మిద్దెపై ఆయన సతీమణి నల్లపాటి మమత పెంచుతున్న మొక్కలు ప్రకృతి ప్రేమికులను మైమరపిస్తున్నాయి. హరితహారంలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చిన కిట్లు తనలో ఆసక్తిని మరింత పెంచాయని వారు చెబుతున్నారు.

## వ్యాధి విజృంభణ, అత్యధిక కేసులు, ఎక్కువ మరణాలు నమోదవుతున్న 5 రాష్ట్రాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్7కోవిడ్ మహమ్మారి తీరును సూచించే విధాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తోంది కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ. వ్యాధి వ్యాప్తి, కేసులు సంఖ్య ఎగబాకుతున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రభావవంతంగా చర్యలు తీసుకునేలా ఆరోగ్య శాఖ నిరంతరం ఆయా ప్రాంతాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, సంక్షోభ నిర్వహణ చర్యలపై అధిక దృష్టి పెట్టింది. దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి 5 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఆరోగ్య కార్యదర్శులతో కోవిడ్ నిర్వహణపై చర్చించారు. వాటి పరిధిలో ఉన్న 35 జిల్లాల్లో పరిస్థితిని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సమీక్షించారు.

ఈ 35 జిల్లాలు... పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా, హౌరా, ఉత్తర 24 పరగణాలు, 24 దక్షిణ పరగణాలు; మహారాష్ట్రలో పూణే, నాగ్‌పూర్, థానే, ముంబై, ముంబై సబర్బన్, కొల్హాపూర్, సంగ్లి, నాసిక్, అహ్మద్‌నగర్, రాయ్‌గడ్, జల్గావ్, సోలాపూర్, సతారా, పాల్ఘర్, ఔరంగాబాద్, ధూలే, నాందేడ్; గుజరాత్‌లో సూరత్; పుదుచ్చేరిలో పాండిచేరి; జార్ఖండ్‌లోని తూర్పు సింగ్‌భూమ్; ఢిల్లీలోని మొత్తం 11 జిల్లాలు.

డిజిటల్ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శులతో పాటు, జిల్లా కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు, ప్రభావిత జిల్లాల ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.

కేంద్ర కార్యదర్శి మాట్లాడుతూ, కొమొర్బిడ్ వ్యాధిగ్రస్తులు,వృద్ధ జనాభాపై దృష్టి సారించే క్రియాశీల కేసులులను గుర్తించే విధానాన్ని బలోపేతం చేయడం ద్వారా అంటు వ్యాధి అణచివేత, అరికట్టడం, చివరికి విచ్ఛిన్నం చేయవలసిన అవసరాన్ని నొక్కిచెప్పారు; ప్రభావిత ప్రాంతాల్లో నియంత్రణ చర్యలను పునఃపరిశీలించడం, బలోపేతం చేయడం;పాజిటివిటీ రేట్లను 5% కన్నా తక్కువకు తగ్గించడానికి పరీక్ష గతిని పెంచాల్సి ఉందని ఆయన తెలిపారు.

ఈ జిల్లాల్లో కోవిడ్ -19 ప్రస్తుత స్థితిపై రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శులు సమగ్ర విశ్లేషణ చేశారు. వారు నియంత్రణ చర్యలు, కాంటాక్ట్ ట్రేసింగ్, నిఘా కార్యకలాపాలు, మరణాల రేట్లు, వారపు కొత్త కేసులు, మరణాల పరంగా పోకడలు మొదలైన అంశాలను సవివరంగా అందించారు. వచ్చే ఒక నెల వరకు వివరణాత్మక రోడ్‌మ్యాప్‌లు, కార్యాచరణ ప్రణాళికలను కూడా వారు చర్చించారు. జిల్లాలో నిర్వహించిన ఆర్టీ-పిసిఆర్, రాపిడ్ యాంటిజెన్ పరీక్షల వివరాలు, యాంటిజెన్ పరీక్షల నుండి రోగలక్షణ నెగటివ్‌లను తిరిగి పరీక్షించడం, పరీక్షా ప్రయోగశాల వినియోగం, ఆసుపత్రిలో చేరడం, ఆక్సిజన్ అందుబాటు ఉన్న పడకలు, ఐసియు పడకలు, వెంటిలేటర్ మొదలైన వాటి బెడ్ ఆక్యుపెన్సీల వివరాలను కేంద్రంతో ఆ రాష్ట్రాలు పంచుకున్నాయి.

నిర్దిష్ట ప్రాంతాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలు / యుటిలకు సూచించారు:

1. కఠినమైన నియంత్రణ చర్యలను అమలు చేయడం, సామాజిక దూర చర్యలను అనుసరించడం ద్వారా సంక్రమణ వ్యాప్తిని పరిమితం చేయడం, కఠినమైన పెరి-మీటర్ నియంత్రణ, ఇంటింటికీ కేసులను చురుకుగా గుర్తించడం.

2. జిల్లాల వ్యాప్తంగా పరీక్షలను పెంచడం ద్వారా సకాలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించడం, ఆర్టీ-పీసీఆర్ పరీక్ష సామర్థ్యం ఐచ్ఛిక వినియోగం

3. ఇళ్లల్లో ఐసొలేషన్లలో ఉన్నవారి ప్రభావవంతమైన పర్యవేక్షణ వ్యాధి, వ్యాధి తీవ్రతరం అయితే ముందుగా గుర్తించి ఆస్పత్రులకు తరలించడం

# తెలంగాణ పథకాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

## -అందుకే సాయం చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం

ఖమ్మం,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): రహదారుల నిర్మాణాలు, మరమ్మతులో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. కరోనా కష్టకాలంలో కూడా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను విరామం లేకుండా అమలు చేస్తున్నదని అన్నారు. తెలంగాణ పథకాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చేవిగా ఉండటంతో రాష్ట్రపై కేంద్రం కక్షసాధిస్తోందని అన్నారు. అతి తక్కువ సమయంలో దేశంలోనే గర్వించదగ్గ రాష్ట్రంగా ఎదుగుతున్న తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. కొత్తలంకపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సింగరేణి సంస్థ రూ.40 కోట్లు డిపాజిట్ చేసిందన్నారు. 4.4 కి.మీ.పొడవున రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.7కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు రూ.967 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణం చేపడుతున్న విషయం అందరికీ తెలిసిందేనని, దీనిలో భాగంగా సత్తుపల్లి సింగరేణి నిధులు ఈ నిర్మాణానికి కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. ఈ నిర్మాణాన్ని ఏడాదిన్నరలోపు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రస్తుతం ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు ఉన్న రహదారి గుంతలమయంగా మారిందని అన్నారు. ప్రస్తుతం ఈ రూట్‌లో కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ హైవేను మంజూరు చేయగా ఆ నిర్మాణం లో నిర్లక్ష్యం జరుగుతోందని అన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ నామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంపీలు ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తారని అన్నారు. అలాగే సత్తుపల్లి నుంచి వీఎం బంజరు వరకు సింగరేణి నిధులతో నాలుగు లైన్ల రోడ్డును ఏర్పాటు చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.

# కరోనాతో ప్రయాణాలపై ప్రజల అనాసక్తి

## -పండగలకు వెళ్లేందుకు విముఖత

ముంబై,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): కొవిడ్ మూలంగా దేశీయ ట్రావెల్ పరిశ్రమపై పెద్ద దెబ్బనే పడింది. విమానయానం సహా ఇతర రంగాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రయాణాలపై ఆంక్షలు ఎత్తివేసినప్పటికీ ప్రజలు మాత్రం అప్రమత్తంగానే ఉంటున్నారు. అయితే వచ్చే పండగల సీజన్‌పై ప్రయాణ పరిశ్రమ కొంత ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆ ఆశలు అడియాశలయ్యే అవకాశం ఉందని తాజా సర్వే ద్వారా వెల్లడైంది. వచ్చే అక్టోబరు-నవంబరులో ప్రయాణాల కోసం 20 శాతానికన్నా తక్కువ మంది ప్రణాళికలు చేసుకున్నట్టు తేలింది. ప్రతి సంవత్సరం ఈ రెండు నెలల్లోనే పెద్ద పండగలైన దసరా, దుర్గా పూజ, దీపావళి వస్తుంటాయి. ఈ సందర్భంగా అనేక మంది వివిధ ప్రాంతాలకు వెళ్లి పండగలు జరుపుకుంటారు. అయితే ఈసారి మాత్రం తమ ప్రయాణ తేదీ దగ్గరపడే వరకు బుకింగ్‌లు చేసుకోవాలనుకోవడం లేదని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ సర్వేలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది పేర్కొన్నా రు. దేశవ్యాప్తంగా

239 జిల్లాల్లోని 25,000కు పైగా మంది సర్వేలో పాల్గొన్నారు. ఇందులో 19 శాతం మంది ఈ ఏడాదిలో పండగల సందర్భంగా ప్రయాణాలు చేయనున్నట్టు తెలిపారు. కొవిడ్ కారణంగా ఈ ఏడాదిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయని లోకల్ సర్కిల్స్ పేర్కొంది. అన్‌లాక్ 4.0లో ఆంక్షలను ఎత్తివేసినా ప్రయాణాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నట్టు తెలిపింది.

# పల్లె ప్రగతిలో పచ్చగా పెరిగిన మొక్కలు

## -కలెక్టర్ ప్రత్యేక చర్యలతో ఏపుగా పచ్చదనం

భద్రాద్రికొత్తగూడెం,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో వేసవిలో కూడా అవి పచ్చగా ఏపుగా పెరిగాయి. దీనికి తోడు ఉపాధిపథకంలో కూడా ఇందుకోసం నిధులు కేటాయించడంతో పల్లెప్రగతి మొక్కల రక్షణకు ఢోకా లేకుండా పోయింది. కలెక్టర్ ఎంవీ రెడ్డి పల్లెప్రగతి మొక్కలు, పకృతి వనాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పంచాయతీ అధికారులు మొక్కల సంరక్షణలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నాలుగు కిలోమీటర్ల మేర జాతీయ రహదారికి ఎవెన్యూ ప్లాంటేషన్ వెయ్యాలని నిబంధనలు ఉండటంతో పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించారు. దారంతా అందంగా ఉండేలా మొక్కలు నాటించి వాటికి ప్రతిరోజు నీరుపోసి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్లల్లెప్రగతి మొక్కలు ఏపుగా పెరిగి, రహదారులకే అందాలుఫలితంగా జాతీయ రహదారి పచ్చని మొక్కలతో తళుక్కు మంటున్నాయి. పూలు, ఔషధం, నీడనిచ్చే మొక్కలు నాటారు. ఎన్నడూ లేని విధంగా పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించి ట్రాక్టర్, ట్యాంకర్‌లు సమకూర్చడంతో మొక్కలకు ప్రాణం పోసినట్టయింది. నాడు కలావిహీనంగా ఉన్న దారులు నేడు పచ్చందాలు పరచుకుని కళకళలాడుతున్నాయి. పంచాయతీ సిబ్బంది మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవడం, పెరిగిన పిచ్చిగడ్డిని తొలగించి, చెత్తను తరలిచడం వల్ల దారలన్నీ పరిశుభ్రంగా మారి పోయాయి. పెద్ద పంచాయతీలను చిన్న పంచాయతీలుగా మార్చి నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని అమలు చేయడంతో పల్లెలు ఆహ్లాదంగా మారిపోయాయి. రహదారి పక్కన మొక్కలు ఏపుగా పెరగడంతో రహదారులకు అందం వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టం అమల్లోకి తీసుకొచ్చాకా పంచాయతీల అభివృద్ధి పరుగులు పెడుతున్నది. జాతీయ రహదారి వెంబడి వేసిన ప్లల్లెప్రగతి మొక్కలు రహదారులకే అందాలను తెచ్చిపెట్టాయి. దీనికి తోడు మొక్కల సంరక్షణ బాధ్యతలు కొంత వరకు ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకునే అవకాశం కల్పించగా మొక్కలు మరింత సంరక్షణలో పెరుగుతున్నాయి.

# కరోనా మహమ్మారి నుంచి బయటపడ్డ బాలు

## ఛెస్ట్ ఇన్‌ఫెక్షన్‌తో మరికొంత కాలం అస్పత్రిలో చికిత్స

## వెల్లడించిన తనయుడు ఎస్పీ చరణ్

చెన్నై,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కరోనా నుంచి బయటపడ్డారు. ఆయనకు కరోనా నెగిటివ్ వచ్చినట్లు కుమారుడు ఎస్పీ చరణ్ ప్రకటించారు. నాన్న ఊపిరితిత్తుల్లో కొంచెం ఇన్‌ఫెక్షన్ ఉంది.. మరో వారంలో కోలుకుంటారని ఆయన తెలిపారు. నాన్న ఐ-పాడ్‌లో క్రికెట్, టెన్నిస్ మ్యాచ్‌లు చూస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు చూసేందుకు ఆసక్తిగా ఉన్నారని చరణ్ పేర్కొన్నారు.

బాలుకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఆగస్టు 5వ తేదీన చెన్నైలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆయన తన 51వ వివాహ వార్షికోత్సవాన్ని ఆసుపత్రిలోనే శ్రీమతితో కలిసి చేసుకున్నాడని తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. డాక్టర్లు, ఐసీయూ సిబ్బంది నడుమ బాలు ఈ వేడుక జరుపుకున్నట్టు సమాచారం. ఈ దంపతులు ఇద్దరు కేక్ కూడా కట్ చేసినట్టు వార్తలు వస్తున్నాయి.

# కేరళ ఆరోగ్యమంత్రి శైలజ రాజీనామాకు డిమాండ్

## -బిజెపి మహిళా మోర్చా నిరసనలు

తిరువనంతపురం,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజా తన పదవికి రాజీనామా చేయాలని ఆ రాష్ట్రానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా సభ్యులు డిమాండ్ చేశారు. పట్టనంథిట్టలో కరోనా పాజిటివ్ మహిళపై అంబులెన్స్ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడటంపై నిరసన తెలిపారు. సోమవారం ఆ

రాష్ట్ర సచివాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహించి ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆమె దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. రాష్ట్రంలో కరోనాను నియంత్రించలేకపోతున్నారని విమర్శించారు.

# అభివృద్ధికి కృషి చేయండి: ఎర్రబెల్లి హితవు

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): రాష్ట్ర జెడ్పీ కో ఆప్టెడ్ ఫోరం ఉపాధ్యక్షులుగా ఎన్నికైన జనగామ జిల్లా జెడ్పీకోఆప్షన్‌మెంబర్ మహమ్మద్ మదార్ పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ జెడ్పీ కో ఆప్టెడ్ మెంబర్లు జిల్లాల అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

సభ్యులు రాష్ట్ర జెడ్పీ కో ఆప్టెడ్ ఫోరం ఏర్పడడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఫోరం కన్వీనర్ గడిలా కుమార్, రాష్ట్ర నాయకులు వర కుమార్, మాణిక్య రెడ్డి, కొడకండ్ల మండల ఎంపిటిసీల ఫోరం అధ్యక్షులు అందే యాకన్న, ప్రసాద్, రాజు తదితరులు కలిసి నిధులు, విధులు అమలు గురించి మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారితో మంత్రి మాట్లాడుతూ ఎంపిటీసీల ఫోరం సమస్యల్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లి చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# కరోనా చుట్టూ అమెరికా అధ్యక్ష ఎన్నికలు

## వ్యాక్సిన్‌పై ట్రంప్ ప్రకటనలపై విమర్శలు

## నవంబర్ నాటికి అసాధ్యమంటున్న నేతలు

వాషింగ్టన్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఇప్పుడు కరోనా వైరస్‌కి వ్యాక్సిన్ చుట్టూ తిరుగుతున్నాయి దీనిపై ట్రంప్ ప్రకటనలు అంతా ఎన్నికల కోసమే అన్న విమర్శలు వస్తున్నాయి. ట్రంప్ తన గెలుపుకోసం వ్యాక్సిన్ ప్రచారాన్ని ఉపయోగించుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపెవరిదన్న చర్చ ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాట్ల అభ్యర్థి జో బైడెన్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. నవంబర్ 3న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల పైనే అందరి దృష్టి నెలకొని ఉంది. ఈసారి ఎన్నికల్లో కరోనా వైరస్ నంబర్ గేమ్‌ని మార్చేస్తుందని అంచనాలున్నాయి. కరోనా కట్టడిలో ట్రంప్ వైఫల్యంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. అగ్రరాజ్యంలో ఎన్నికల నాటికి వైరస్ కారణంగా 2 లక్షల 60 వేల వరకు మరణాలు నమోదవుతాయని అంచనాలున్నాయి. ట్రంప్ చెబుతున్నట్టుగా అక్టోబర్ సర్‌ప్రైజ్ సాకారమై పోలింగ్ తేదీలోగా వ్యాక్సిన్ వస్తే ఆయనకి మళ్లీ అనుకూలంగా పరిస్థితులు మారే అవకాశాలు ఉన్నాయి. ఆర్థిక మాంద్యం, పెరిగిపోతున్న నిరుద్యోగం, జాతివివక్ష, వలసవిధానం, వాతావరణంలో మార్పులు వంటి అంశాలు కూడా ఎన్నికల్లో ప్రధాన అంశాలు కానున్నాయి. ఇకపోతే కరోనా వ్యాక్సిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై డెమొక్రటిక్ ఉపాధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ స్పందించారు. ఎన్నికల్లో లబ్ది పొందడం కోసమే ట్రంప్.. ఆ వ్యాఖ్యలు చేశారని ఆమె ఆరోపించారు. అమెరికాలో ఓ వైపు కరోనా కరాళ నృత్యం చేస్తోంటే.. మరోవైపు అధ్యక్ష ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలకు కరోనా అంశం ప్రధాన అస్త్రంగా మారింది. కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో ట్రంప్ సర్కార్ విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీంతో ఎన్నికలకు ముందే అమెరికాలో కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందంటూ ట్రంప్ ప్రకటించారు. ఈ క్రమంలో అమెరికాలోని సీడీసీ.. నవంబర్ 1 నాటికి కరోనా వ్యాక్సిన్‌ను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్రాలకు సూచించింది. ఈ నేపథ్యంలో డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ స్పందించారు. వ్యాక్సిన్‌పై ట్రంప్ చెప్పే మాటలను తాను విశ్వసించనని తెలిపారు. ఒకవేళ నవంబర్ 1 నాటికి అమెరికాలో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినా.. దాని సామర్థ్యంపై తనకు నమ్మకం లేదన్నారు. ఎన్నికల్లో లబ్ది పొందడం కోసం వ్యాక్సిన్ తయారీ సంస్థలపై ట్రంప్ ఒత్తిడి చేస్తున్నా రని కమలా హారిస్ ఆరోపించారు. ఇదిలా ఉంటే.. అమెరికాలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతోంది. అమెరికాలో కరోనా వైరస్ బారినపడిన వారి సంఖ్య 62లక్షలు దాటగా.. 1.88లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ప్రజాదరణ ఓట్లు సాధించిన వారే పీఠాన్ని దక్కించుకుంటారని చెప్పలేం. గత ఎన్నికల్లో ట్రంప్ కంటే పాపులర్ ఓట్లు 30 లక్షలు అధికంగా హిల్లరీ క్లింటన్ సాధించినప్పటికీ ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ట్రంప్‌కి ఎక్కువ రావడంతో ఆయన అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నారు. నవంబర్ 3న జరిగే ఎన్నికల్లో ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థి పార్టీకి ఓటు వేస్తారు. ఆ ఓటింగ్ రాష్ట్రాల స్థాయిలోనే ఉంటుంది. అక్కడ ఎన్నికైన ప్రతినిధులంతా కలిసి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. దేశం మొత్తమ్మీద 50 రాష్ట్రాలు, డిస్ట్రిక్ట్ కొలంబియాలో జనాభా ప్రాతిపదికన ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఉంటాయి. దేశవ్యాప్తంగా 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లకిగాను 270 ఓట్లు సాధించిన వారే అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. తాజా సర్వేల్లో జార్జియా, అయోవా, టెక్సాస్ రాష్ట్రాల్లో ట్రంప్‌కి మొగ్గు కనిపిస్తూ ఉంటే, మిగిలిన స్వింగ్ స్టేట్స్‌లో బైడెన్ దూసుకుపోయే అవకాశాలు ఉన్నట్టుగా రియల్ క్లియర్ పాలిటిక్స్ సర్వే అంచనా వేస్తోంది. టెక్సాస్, జార్జియా రాష్ట్రాలు ఎప్పుడూ రిపబ్లికన్ల వైపు ఉంటాయి. ఈసారి కూడా ట్రంప్‌వైపే ఉన్నప్పటికీ మొగ్గు చాలా స్వల్పంగా ఉందని అంచనా. అందుకే టెక్సాస్, జార్జియా రాష్ట్రాల్లో ఎలాగైనా పాగా వెయ్యాలని బైడెన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ రాష్ట్రాల్లో ప్రచారం కోసం డాలర్ల వరద పారిస్తున్నారు. జాతీయ స్థాయిలో చూసుకుంటే ట్రంప్ కంటే అంతకు ముందు ఎన్నికల్లో బరాక్ ఒబామా 51 శాతంఓట్లను సాధించి అవలీలగా అధ్యక్ష పదవిని అందుకున్నారు. ఈ రాష్ట్రంలో ప్రజల ఆలోచనా ధోరణి వినూత్నంగా ఉంటుంది. యువ ఓటర్లు ఎక్కువ మంది ఉన్నారు. ఇక్కడ ఓటర్లు అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగే డిబేట్లను విన్నాక ఓటుపై నిర్ణయం తీసుకుంటారు. ఎన్నికలకి ముందు మూడు సార్లు సెప్టెంబర్ 29, అక్టోబర్ 7, అక్టోబర్ 15న అధ్యక్ష అభ్యర్థుల మధ్య బిగ్ డిబేట్స్ జరుగుతాయి. ఈ డిబేట్స్‌లో ట్రంప్, బైడెన్ తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తారో వివరిస్తారు. ఆ డిబేట్స్ తర్వాత పరిస్థితులన్నీ మారే అవకాశాలైతే ఉన్నాయి.

# జగన్ పాలానాంశాలు విపక్షానికి కలసి వచ్చేనా?

## టిడిపి పోరాటం ప్రజల్లో కదలిక తీసుకుని వస్తుందా

## ఆర్థిక పరిస్థితులపై పోరాటంలో బాబు వ్యూహం ఫలించేనా

అమరావతి,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): ఎపిలో అనేకానేక అంశాలు ఇప్పుడు టిడిపికి, చంద్రబాబుకు కలసి వస్తున్నాయి. ప్రధానంగా అమరావతి పోరాటాలకు తోడు ఇటీవలి కోర్టు తీర్పులు కూడా కలసి వస్తున్నాయి. అనేకానేక కేసుల్లో తీర్పులన్నీ సర్కార్‌కు వ్యతిరేకంగా వచ్చాయి. వీటి ఆధారంగా బాబు ఆయా అంశాలపై పోరాడుతున్నారు. అయితే మరో ప్రతిబంధకరకం కూడా అయ్యాయి. కరోనా కారణంగా యాన హైదరాబాద్ వదిలి వెళ్లలేకపోతున్నారు. హైదరాబాద్‌కే పరిమితం కావడం వల్ల ప్రజల్లోకి వెళ్లే అవకాశం రావడం లేదు.

అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేసిన అభివృద్ధి, ప్రదర్శించిన విజన్ కారణంగా రాష్ట్ర విభజన తర్వాత 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. ఐదేళ్లు గడిచేసరికి రాజశేఖర్ రెడ్డి తనయుడు జగన్‌మోహన్ రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. తండ్రీకొడుకుల చేతిలో ఓడిపోయిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇలా దేశంలో తనకు తానుగా చరిత్ర సృష్టించుకున్నారు. ఉమ్మడి ఎపిలో 2004లో ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతలో ఓటమి పాలయ్యారు. తిరిగి విభజిత ఎపిలో 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన తనయుడు వైఎస్ జగన్ నేతృత్వంలోని వైకాపా చేతిలో ఘోరంగా ఓడిపోయారు. తన తండ్రి రాజశేఖర్ రెడ్డిని మించి ఓట్లూ సీట్లూ సాధించి జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ తిరస్కారానికి గురయిన జగన్ ముఖ్యమంత్రి కావాలన్న తన కోరికను నెరవేర్చుకున్నా..ఎక్కువ సమయం బాబును ఆయన, టీమ్‌ను ఇబ్బంది పెట్టే యత్నాల్లో ఉన్నారు. ఇకపోతే అభివృద్ధి కార్యక్రమాలకు బదులు అమరావతి తరలింపు, డబ్బుల పందేరం లాంటి కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. తండ్రి వైఎస్ మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీతో విభేదించి సొంత పార్టీ పెట్టుకున్నాక అధికారం పొందినా చరిత్ర సృష్టించినా, పాలనాపరంగా అనేకానేక అవాంతరాలు ఎదుర్కొంటున్నారు. 2014లో ఓటమి ఎదురైనప్పటికీ కుంగిపోకుండా పాదయాత్ర పేరిట మళ్లీ జనంలో పడ్డారు. ఊహకు కూడా తట్టని వ్యూహాలతో చంద్రబాబును ఊహించని విధంగా దెబ్బకొట్టారు. దాదాపు పదేళ్ల నిరీక్షణ తర్వాత ముఖ్యమంత్రి పదవిని దక్కించు కున్నారు. అది కూడా ఆషామాషీగా కాదు. యాభై శాతం ఓట్లు సాధించడంతో పాటు, 151 సీట్లు గెలుచు కున్నారు. దీంతో అంతులేని అధికారం ఆయన సొంతమైంది. పార్టీలోనూ,ప్రభుత్వంలోనూ ఆయనను ప్రశ్నించేవారే లేకుండా పోయారు. దీంతో అనేక నిర్ణయాలు దూకుడుగా తీసుకోవడంతో టిడిపి నేతలు దీనిపై పోరాటం చేస్తున్నారు. కోర్టులు కూడా అనేక అంశాల్లో కళ్లెం వేస్తున్నాయి. రాజధాని తరలింపు, ఇంగ్లీష్ మీడియం తదితర అంశాలు నిదర్శనంగా చూసుకోవాలి. అయితే కక్షపూరిత రాజకీయాలు మంచి చేస్తాయా, చెడు చేస్తాయా? వంటి ప్రశ్నలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్ర రాజకీయ రంగస్థలంలో అనేక అంవాలపై చర్చలు సాగుతున్నాయి. చంద్రబాబు కంటే మెరుగ్గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలందరికీ మేలు చేస్తారని జనం విశ్వసించారు. రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కూడా మండుటెండలో పాదయాత్ర చేసిన అనంతరమే రాజశేఖర్ రెడ్డి అందరికీ ఆమోద యోగ్యుడు అయ్యారు. ఫలితమే ముఖ్యమంత్రి పదవి. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం పాటించడం వల్లనే ఆయన 2009లో మళ్లీ అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ఆయన కుమారుడైన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి టిడిపిపై కసీ, పగతో నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ప్రచారం ఉంది. రాజకీయ ప్రత్యర్థులనే కాకుండా తనను వ్యతిరేకించిన వారందరినీ టార్గెట్‌గా ఎంచుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చంద్రబాబుపై దుష్ప్రచారం చేసి రాజకీయలబ్ది పొందిన జగన్, ఆ విషయం మర్చిపోయి తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కూడా వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉండే వారన్న అనుమానంతో వ్యాపార, పారిశ్రామికవేత్తలను కూడా వదలడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ ధోరణుల వల్ల కొంతమంది వ్యక్తులు, కొన్ని సంస్థలు దెబ్బతిన్నాయి. వివిధ అంశాల్లో టిడిపి వాటిని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నది. అయితే ఈ పోరాటాలు ఎంతవరకు సఫలం అవుతాయన్నది ముమ్ముందు జరిగే పరిణామాలను బట్టి ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాలకు రుణాలు మంజూరు చేస్తే ఆ డబ్బును కూడా సంక్షేమం పేరిట జగన్ ప్రభుత్వం పంచిపెడుతుందని ఆర్థిక సంస్థలు భయపడుతున్నాయి. అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక పైసా కూడా విడుదల చేయలేదు. గతంలో కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యే వరకు వేచి ఉండకుండా చంద్రబాబు ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు సర్దుబాటు చేసేది. ఇప్పుడు ప్రభుత్వ ఖజానా ఒట్టిపోయింది. ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందడానికి వీలుగా జగన్ ప్రభుత్వం వివిధ సంస్థలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ ఖజానాలో డబ్బు జమ కాగానే జగన్‌మోహన్ రెడ్డి వాటిని నవరత్నాల పేరిట పంచుతారన్న ప్రచారం వ్యాపించింది. మితిమీరిన సంక్షేమ భారం రాష్ట్రం పాలిట గుదిబండ అవుతోంది. సంక్షేమం అనే పులిపై జగన్ స్వారీ చేస్తున్నారు. అప్పు చేసి పప్పుకూడు ఎంతకాలం అన్న ప్రశ్నలు ఇప్పుడిప్పుడే ప్రజల నుంచి కూడా వినిపిస్తున్నాయి. ఈ దశలో టిడిపి చేస్తున్న పోరాటాలకు పునాది దొరికింది. అయితే ఎంత సమర్థంగా వీటిని ఎత్తుకుని టిడిపి ముందుకు పోతుందన్నది కూడా ముఖ్యమే

# జిల్లా అభివృద్ధికి పాటుపడండి

## -కో ఆప్షన్ సభ్యులకు మంత్రి ఎర్రబెల్లి




హైదరాబాద్,సెప్టెంబరు7 (ఆర్ఎన్ఎ): పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ని ఎండీ మదార్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర జెడ్పీ కో ఆప్టేట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా జనగామ జిల్లా జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మదార్ మంత్రిని కలిసి పూల మొక్కను అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ జెడ్పీ కో ఆప్షన్ మెంబర్లు జిల్లాల అభివృద్ధికి సహకరించాలని అన్నారు. జెడ్పీ సభ్యులు రాష్ట్ర జెడ్పీ కో అప్టేట్ ఫోరంగా ఏర్పడటంపై హర్షం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారందరికీ అభినందనలు తెలియజేశారు. కాగా, ఫోరం రాష్ట్ర కన్వీనర్ గడిల కుమార్, రాష్ట్ర నాయకులు వర కుమార్, మాణిక్య రెడ్డి, కొడకండ్ల మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అందే యాకన్న, ప్రసాద్, రాజు తదితరులు కలిసి నిధులు, విధుల అమలు గురించి మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

# భద్రాద్రి జిల్లాలో మరో ఎన్‌కౌంటర్

## ఇద్దరు మావోలను మట్టుబెట్టిన పోలీసులు

## సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ సునీల్‌దత్

భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్7 (ఆర్ఎన్ఎ): జిల్లాలో మరో ఎన్ కౌంటర్ జరిగింది. చర్ల - ఛత్తీస్ ఘడ్ సరిహద్దు అడవుల్లో ఎదురు కాల్పులు చోటు చేసుకోగా ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఎన్ కౌంటర్ ప్రాంతానికి తరలి వెళ్లిన కొత్తగూడెం జిల్లా ఎస్పీ సునీల్ దత్ అక్కడ పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మావోయిస్టులు మందు పాతర పేల్చిన గంటల వ్యవధిలోనే పోలీసుల ఎన్ కౌంటర్ జరిగింది. దీంతో వరుస ఘటనలతో ఏజెన్సీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం తాలిపేరు ప్రాజెక్టు రోడ్ వద్ద మావోయిస్టులు గత రాత్రి మందుపాతర పేల్చారు.

అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఉనికి కోసమే మావోయిస్టులు మందుపాతర పేల్చినట్టు స్పష్టమౌతుందని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల భద్రాద్రి జిల్లా గుండాల మండలం దేవల గూడెం వద్ద ఎన్కౌంటర్లో శంకర్ అనే మావోయిస్టు మృతి చెందిన విషయం విదితమే. శంకర్ ఎన్కౌంటర్ నిరసనగా ఆదివారం నాడు భద్రాద్రి జిల్లా తూర్పు గోదావరి జిల్లా భూపాలపల్లి ములుగు జిల్లాల బంద్‌కి మావోయిస్టులు పిలుపునిచ్చారు. బందు వల్ల జన జీవనానికి ఎటువంటి ఇబ్బంది కలగలేదు. కానీ గత రాత్రి మావోయిస్టులు చర్ల సమీపంలోని తిప్పాపురం అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై మందు పాత్ర పేల్చి శంకర్ పేరుతో వేసిన కరపత్రాన్ని వదిలిపెట్టి వెళ్లారు .ఈ ఘటనతో పోలీసు యంత్రాంగం ఉలిక్కిపడింది. కూంబింగ్ చేపడుతున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్టు చెబుతున్నారు.

# ఎల్ఆర్ఎస్‌పై హైకోర్టులో పిల్

## జీవో 131 సస్పెండ్ చేయాలని పిటీషన్

## విచారణ అక్టోబర్ 9కి హైకోర్టు వాయిదా

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్‌పై హైకోర్టులో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిల్ దాఖలు చేసింది. జీహెచ్ఎంసీలో భవనాల క్రమబద్ధీకరణ పథకంపై హైకోర్టులో విచారణ జరిగింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిల్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ ఏ స్థితిలో ఉందో నివేదిక ఇవ్వాలని జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశించింది. దరఖాస్తులు ఎన్ని వచ్చాయి.. ఎన్ని తిరస్కరించారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ పేరుతో అక్రమ నిర్మాణాలు రాకుండా చూడాలని హైకోర్టు పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబర్ 9కి హైకోర్టు వాయిదా వేసింది. ఎల్ఆర్ఎస్ జీవో 131 సస్పెండ్ చేయాలని పిటీషన్ వేశారు. అనుమతి లేని అక్రమ లేఔట్లను క్రమబద్ధీరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో రద్దు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్ అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లే అవుట్ రూల్స్ 2020 ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఏరియా' ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆగస్టు 26 వరకూ రిజిస్ట్రేషన్ చేసుకున్న అనధికార, అక్రమ లే అవుట్‌లలోని స్థలాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ జీవో నంబరు 131ని జారీ చేశారు. ఈ పథకం రాష్ట్రమంతటికీ వర్తించనుంది.

# లారీ డ్రైవర్లకు కరోనా టెస్టులు: కలెక్టర్

ఆసిఫాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): బయటి నుంచి వచ్చే వాహనాల వల్ల కేసులు ఎక్కువ అవుతున్నందున లారీడ్రైవర్లకు కరోనా టెస్టులు చేయాలని వైద్యాధికారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బయటి నుంచి వచ్చే వారిని గుర్తించి టెస్టులు చేయాలన్నారు. దీంతో కరోనా వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కొవిడ్-19 నివారణలో భాగంగా గ్రామాల్లో వైద్య సిబ్బంది ర్యాపిడ్ టెస్టులు చేయాలని అన్నారు. కరోనా వైరస్ నివారణ చర్యల్లో భాగంగా సంబంధిత అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఆసిఫాబాద్ మండలం లోని అడ, బాబాపూర్, గంగాపూర్, సిర్పూర్(యూ), కాగజ్‌నగర్‌లలో ప్రతి ఏరియాలో వందకు పైగా ర్యాపిడ్ టెస్టులు చేయాలన్నారు. వాంకిడి చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 నుంచి ఈ రోజు ఉదయం 9 గంటల వరకు ఏడు వాహనాలు రాగా 37 మంది ప్యాసింజర్స్ వచ్చారన్నారు. అందులో 19 మంది హోం క్వారంటైన్‌లో ఉన్నట్లు తెలిపారు. గోలేటి క్వారంటైన్‌లో 18, సింగరేణి ఐసోలేషన్‌లో 9, వాంకిడి క్వారంటైన్‌లో 53, సాంఘిక గురుకుల పాఠశాలలో 78, ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో 71, కాగజ్‌నగర్ పోస్టు మెట్రిక్ గర్ల్స్‌లో 50 మంది మొత్తం 279 మంది కొవిడ్ అనుమానితులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 11,894 మంది శాంపిల్స్‌ను పరీక్షించగా 912 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు.

# అబద్ధాలు చెప్పి ఓట్లు దండుకున్నారు

## 3 నుంచి డివిజన్ యాత్ర చేపడతా: రేవంత్

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): అందమైన అబద్దాలు చెప్పి ఓట్లు దండుకున్న టీఆర్ఎస్ నేతలు ఏం మొహం పెట్టుకుని రాబోయే జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం ఎన్నికల్లో మళ్లీ ఓట్లు అడుగుతారని మల్కాజ్‌గిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తాము గట్టి పోటీ ఇస్తామని రేవంత్ ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు అన్ని మున్సిపల్ ఎన్నికలను తాము ప్రతిష్టంగా తీసుకుని పోరాడుతామని అన్నారు. మున్సిపల్ మంత్రిగా విఫలమైన కేటీఆర్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదన్నారు.గ్రేటర్‌ను ఇస్తాంబుల్ చేస్తామని, ట్యాంక్ బండ్‌లో నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తామని, లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి 99 డివిజన్లలో టీఆర్ఎస్ గెలిచిందన్నారు. కానీ, గ్రేటర్‌లో ఇప్పటివరకు కేవలం 128 ఇళ్లు మాత్రమే కట్టారని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకపోవడం వల్ల కిరాయి రూపంలో పేదలపై రూ.1,200 కోట్ల భారం పడిందని చెప్పారు. హైదరాబాద్‌లో అద్భుతాలు సృష్టించినట్టు కేటీఆర్ గొప్పలు చెబుతున్నారని, పేద ప్రజలకు ఉపయోగపడే చోట ఎక్కడా రోడ్లు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. అక్టోబర్ 3 నుంచి తన పార్లమెంట్ పరిధిలో 'డివిజన్ యాత్ర'చేపడుతున్నానని, టీఆర్ఎస్ విస్మరించిన హామీలపై ప్రజలను చైతన్య పరుస్తానని రేవంత్ చెప్పారు. అయ్యప్ప సొసైటీలో ప్రజలను భయపెట్టి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు పాలన చేశారని ఆరోపించారు. వరంగల్ పర్యటనలో సీఎం కేసీఆర్ ప్రజలకు అనేక హామీలిచ్చారని, కనీసం డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వని కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

# ఇఫ్లూ యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణకు ఎన్ఐఎ నోటీసులు

హైదరాబాద్,సెప్టెంబరు7 (ఆర్ఎన్ఎ): విరసం నేత వరవరరావు అల్లుడు, ఇఫ్లూ యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నోటీసులు పంపింది. భీమా-కోరెగావ్ అల్లర్లు, ప్రధాని నరేంద్ర మోదీ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలతో.. విప్లవ రచయితల సంఘం నేత వరవరరావును పూణె పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విషయంలో వరవరరావు అల్లుడు, ప్రొఫెసర్ సత్యనారాయణ ఇంట్లో 2018లోనే ఎన్ఐఏ సోదాలు జరిపింది. అయితే తాజాగా ఎన్ఐఏ ఆయనకు నోటీసులు పంపింది. ఈ నెల 9న ముంబైలో తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఎన్ఐఏ ఆదేశించింది. ఎన్ఐఏ పంపిన నోటీసులపై స్పందించిన ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. భీమా-కొరెగావ్ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇప్పటికే వరవరరావు ఆరోగ్య పరిస్థితిపై తామంతా ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ఈ తరుణంలో మళ్లీ ఇలా తనకు నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# గ్రీన్ ఛాలెంజ్‌లో మొక్కలు నాటిన కలెక్టర్



వరంగల్,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు అపూర్వ స్పందన లభిస్తున్నది. మొక్కలు నాటేందుకు పలువురు ప్రముఖులు ముందు కొస్తున్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఏ శరత్ విసిరిన ఛాలెంజ్ ను వరంగల్ అర్బన్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్వీకరించారు. తన క్యాంపు కార్యాలయంలో మొక్కను నాటారు. అనంతరం ఈ ఛాలెంజ్ ని మరో ముగ్గురికి విసిరారు. ములుగ కలెక్టర్ .కృష్ణ ఆదిత్య, వీపీ గౌతమ్ కలెక్టర్ మహబూబాబాద్ ,ఎండీ అక్బర్ సీఎఫ్‌వో వరంగల్‌ను జిల్లా కలెక్టర్ నామినేట్ చేస్తూ గ్రీన్ ఛాలెంజ్ విసిరారు.

# దుబ్బాకలో స్మార కేంద్రం ఏర్పాటు చేయాలి

## -సోలిపేట సంతాప తీర్మానంలో గొంగిడి సునీత వినతి

హైదరాబాద్,సెప్టెంబరు7 (ఆర్ఎన్ఎ): దుబ్బాక నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి స్మారక విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి ఆయన పేరు పెట్టాలని ఎమ్మెల్యే గొంగిడి సునీత సీఎం కేసీఆర్ కు విజ్ఞప్తి చేశారు. ఆయన స్మృతికి చిహ్నంగా ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.రామలిం గారెడ్డి మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా గొంగిడి సునీత మాట్లాడారు. రామలింగారెడ్డి మరణం కంటే నాలుగు రోజుల ముందు కేటీఆర్ దగ్గరకు ఓ పని మీద వెళ్లాను. అప్పుడు తమతో రామలింగన్న ఆరోగ్య పరిస్థితి బాగాలేదు అని కేటీఆర్ అన్నారు. అప్పుడే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆ సమయంలో అసెంబ్లీలో వారు కూర్చుంటున్న చైర్ గుర్తొచ్చింది. సభలో ఎప్పటికప్పుడు రామలింగారెడ్డి సలహాలు, సూచనలు ఇస్తూ తమను ప్రోత్సహిం చేవారని గుర్తు చేసుకున్నారు. అలాగే వివిధ సమస్యలపై మాట్లాడేలా ప్రోత్సహించే వారని అన్నారు. 2014లో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో దౌల్తాబాద్ మండల ఇంచార్జిగా తనను కేసీఆర్ నియమించారు. ఆ సమయంలో రామలింగారెడ్డి ఎంతో గొప్పగా తనను ఆదరించి.. అక్క మాట నిలబెట్టాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. భారీ మెజార్టీ తీసుకువచ్చి అక్క గౌరవాన్ని కాపాడాలని చెప్పారు. రామలింగారెడ్డి అకాల మరణం చెందడం పార్టీకి, దుబ్బాక నియోజకవర్గానికి తీరని లోటు అని ఆమె పేర్కొన్నారు. పేద ప్రజల పట్ల ఆయన అంకితభావంతో పని చేశారు. జర్నలిస్టుగా మంచి పేరు సంపాదించడమే కాకుండా.. రాజకీయాల్లో కూడా మంచి పేరు ప్రఖ్యాతులను రామలింగారెడ్డి సంపాదించారు అని గొంగిడి సునీత పేర్కొన్నారు.

# అక్షరజ్ఞానమే అతి శక్తివంతమైన ఆయుధం

**(08 సెప్టెంబర్ అంతర్జాతీయ అక్షరాస్యత దినం సందర్భంగా)**

మన తల రాతను మనమే రాసుకోవడానికి కావలసినది అక్షరజ్ఞాన సంపదే. చదువు కోవడం ఒక మానవ హక్కుగా భావించిన పోరాట యోధుడు నెల్సన్ మండేలా "ప్రపంచ ప్రగతికి అతి శక్తి వంతమైన ఆయుధం విద్య మాత్రమే" అన్నారు. మనిషికి ధైర్యాన్ని, ఆకర్షనీయగుణాన్ని ఇవ్వగలిగే అదృశ్యనిధి అక్షరాస్యత మంత్రం మాత్రమే. ఆలోచనాశక్తి, విశ్లేషణాత్మక యుక్తి, మంచి చెడుల వివక్షలకు దోహదపడేది విద్యాభ్యాసమే. వ్యక్తి ఆత్మగౌరవం, ప్రపంచ జ్ఞానం మరియు వ్యక్తిత్వ వికాసం ఇనుమడింపజేసే అతి ముఖ్యమైన సాధనంగా అక్షరాస్యత ఉపయోగపడుతుంది. మనిషిని మహా వివేకవంతునిగా, గౌరవ సంఘజీవిగా నిలుపగల సత్తా అక్షరజ్ఞానానికి ఉంటుంది. నిరక్షరాస్యులు ఎక్కువగా శ్రమ దోపిడీకి గురి అవుతూ, పేదలు నిరుపేదలుగా మారుతారు. దేశ సర్వతోముఖాభివృద్ధిలో అక్షరాస్యత ప్రధాన భూమికను నిర్వహిస్తుంది. నిరక్షరాస్యత ఉన్న సమాజంలో వెనుకబాటుతనం, అశాంతి, రాక్షసత్వం రాజ్యమేలుతాయి. ప్రపంచదేశాలలో మానవాళి ఎదుగుదలకు ఉపయుక్తమంగా నిలిచే అక్షరాస్యత ప్రాధాన్యతను గుర్తించిన ఐక్యరాజ్యసమితి ముఖ్య శాఖ యూనెస్కో నేతృత్వంలో 1967 నుండి ప్రతియేట 08 సెప్టెంబర్‌న "అంతర్జాతీయ అక్షరాస్యత దినం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అక్షరాస్యత ప్రాముఖ్యతను, ఆవశ్యకతను మరియు బహుళ ప్రయోజనాలను మానవాళికి వివరిస్తూ, నిరక్షరాస్యతను రూపుమాపే ప్రణాళికలను రూపొందించుటకు ఈ సందర్భాన్ని ఐరాస సభ్యదేశాలు ఘనంగా నిర్వహిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా 773 మిలియన్ల వయోజనులు (వీరిలో 2/3 వంతు మహిళలు) కనీస అక్షరాస్యతా నైపుణ్యాలకు దూరం కావడంతో సమాజంలో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. అగ్రరాజ్యంగా పేరున్న అమెరికాలోనే 32 మిలియన్ల నిరక్షరాస్య వయోజనులు ఉన్నారని అంచనా. అధిక అక్షరాస్యత గల దేశాలలో రష్యా, కెనడా, జపాన్, ఇజ్రాయిల్, యుయస్‌ఏ, సౌత్ కొరియా, న్యూజిలాండ్, యూకే, ఫిన్‌ల్యాండ్ మరియు ఆస్ట్రేలియా ముందు వరుసలో ఉన్నాయి. అంతర్జాతీయ అక్షరాస్యత దినం-2020 నినాదం 'కోవిడ్-19 సంక్షోభ సమయంలో అక్షరాస్యత అమలులో విద్యావేత్తల మరియు బోధన-నేర్చుకునే పద్ధతుల పాత్ర' మీద సమాలోచనలు చేయాలని సూచించారు. యువత మరియు వయోజనుల్లో విద్య సమపార్జన ఒక ముఖ్యమైన జీవితకాల ప్రక్రియ. ప్రభుత్వ విద్యా ప్రణాళికలకు, క్షేత్ర స్థాయిలో అమలుకు మధ్య ఏర్పడిన అంతరాలను కరోనా కల్లోలం మరింత జటిలం చేసింది. వయోజనులకు అక్షరాస్యత కల్పించే ప్రయత్నాలు, పథకాలు రేడియో మరియు టీవీలకు మాత్రమే పరిమితం అయిన వేళ దేశాలలో అక్షరాస్యతను పెంచేందుకు పటిష్ట ప్రణాళికలు, పాలకుల చిత్తశుద్ధి, ఆర్థిక వనరుల అవసరం చాలా ఉంది.

చదివి, వ్రాయగలిగి, మేధో వికాసం చూపగలుటయే అక్షరాస్యతగా నిర్వచించబడింది. వ్యక్తి సమగ్రాభివృద్ధితో పాటు లింగ సమానత్వ సాధనకు అక్షరాస్యత దోహదపడుతుంది. అర్ధశతాబ్దానికి పూర్వం 50 శాతం ప్రపంచ యువత (15 - 24 వయస్సు) నిరక్షరాస్యతలో కూరుకుపోయినా, నేడు 8 శాతం మాత్రమే నిరక్షరాస్యులు ఉన్నారు. 2015 అంచనాల ప్రకారం ప్రపంచ యువతలో లిటరసీ రేటు 91.2 శాతం ఉండగా, ఇండియా 91.66 శాతం ఉన్నది. ప్రస్తుత అంచనా ప్రకారం 2030 నాటికి ప్రపంచదేశాలలో పూర్తి అక్షరాస్యతను సాధించాలనే లక్ష్యంతో పలు ఆచరణీయ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత ఆధునిక శాస్త్రసాంకేతిక విప్లవంలో చదువు రాకపోవడం కుటుంబాలకు శాపంగా మారింది. అధిక జనాభా, ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష, కుల వ్యవస్థ, పేదరికం, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వసతులుగల విద్యాలయాల కొరత వంటి కారణాలు అక్షరాస్యత సాధనకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. విశ్వ నిరక్షరాస్య వయోజనుల్లో 37 శాతం (287మిలియన్లు) భారత్‌లోనే ఉన్నారు. భారత బాలికల్లో 47.78 శాతం పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారు. దళితులు అధికంగా ఉన్న యూపీ, బీహార్, ఝార్ఖండ్ లాంటి రాష్ట్రాలలో లిటరసీ రేటు చాలా తక్కువగా నమోదైనవి. ఇప్పటికీ 60 లక్షల మంది పిల్లలకు బడి తెలియదు. 127 దేశాల అక్షరాస్యత జాబితాలో భారత్ 106వ స్థానంలో (135 దేశాల మహిళా అక్షరాస్యత జాబితాలో భారత్ 123 స్థానం) ఉండడం విచారకరం. కేంద్ర మరియు ఉత్తర భారతంలో 2007 వివరాల ప్రకారం 59 శాతం పాఠశాలల్లో త్రాగునీరు మరియు 89 శాతం పాఠశాలల్లో టాయిలెట్ వసతులు లేకపోవడం విచారకరం. విద్యార్థులు: ఉపాధ్యాయుల నిష్పత్తి 42 : 1 ఉండడం మరియు జిడిపిలో 4.3 శాతం (కొటారీ కమిషన్ ప్రతిపాదించిన 6 శాతం) కన్న ఎప్పుడూ విద్యకు నిధులు కేటాయించక పోవడం కూడా ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. అణగారిన కులాల్లో పాఠశాలకు వెళ్ళని (ఎన్‌రోల్ కాని) వారు, బడి మానేసిన (డ్రాపవుట్స్) వారు ఎక్కువగా ఉన్నారు. వివిధ సామాజిక కారణాలతో విద్యలో బాలల కన్న బాలికలు చాలా వెనుకబడి ఉండటం విచారకరం. 1947లో అక్షరాస్యత రేటు 12 శాతం ఉండగా 2011లో 74.04 శాతం ఉన్నది. అత్యధికంగా కేరళలో 93.91 శాతం మరియు అత్యల్పంగా బీహార్‌లో 63.82 శాతం అక్షరాస్యత రేటు ఉండగా, ఉమ్మడి ఏపిలో జాతీయ రేటు కన్న తక్కువగా 67.7 శాతం మాత్రమే ఉన్నది. 2018 సర్వే ప్రకారం తెలంగాణ అక్షరాస్యత రేటులో హైదరాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో (83.2 శాతం) ఉండగా, చివరన జోగులాంబ గద్వాల జిల్లా (49.9 శాతం) ఉన్నది. దేశంలోని నిరక్షరాస్యులలో 70 శాతానికి పైగా యూపీ, బీహార్, యంపీ, రాజస్థాన్, ఉమ్మడి ఏపి మరియు పశ్చిమ బెంగాల్‌లలోనే ఉన్నారు. మహిళా లిటరసీలో కేరళ మరియు పురుష లిటరసీలో లక్షద్వీప్‌లు జాబితాలో ముందు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రలో లిటరసీ రేటు 67.7 శాతం ఉండగా, పురుషులు 78.3 శాతం మరియు స్త్రీలు 59.2 శాతం నమోదైనారు. యస్సీలలో అక్షరాస్యత రేటు 66.10 శాతం మరియు యస్టీలలో 58.96 శాతం మాత్రమే ఉన్నది. భారత ప్రభుత్వం రూపొందించిన నేషనల్ లిటరసీ మిషన్, సర్వశిక్ష అభియాన్, సమగ్రశిక్ష ప్రోగ్రాం, మధ్యాహ్న భోజన వసతి, ఉపకార వేతనాలు, అవగాహనా కార్యక్రమాలు, మైనారిటీ విద్యాసంస్థలు, ఉచిత నిర్బంధిత విద్య, అనగారిన వర్గాలకు రిజర్వేషన్లు మరియు యన్‌జిఓల సహకారంతో అక్షరాస్యత రేటు పెంచే ప్రయత్నాలు కొంత ఫలితాన్ని ఇస్తూనే ఉన్నాయి.

అక్షరాస్యత పెంచడానికి అవగాహనా కార్యక్రమాలు, దేశ నలుమూలల అన్ని వసతులుగల ప్రభుత్వ విద్యాలయాలు, ఉచిత యూనిఫారం మరియు పాఠ్య పుస్తకాల పంపిణీ, తల్లితండ్రులకు ప్రోత్సాహకాలు, ఉపకార వేతనాలు, మధ్యాహ్న పోషకాహారం, అర్హతగల సుశిక్షితులైన ఉపాధ్యాయులు, రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, డ్రాపవుట్లను బడిలో తిరిగి చేర్చుకోవడం, వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించడం, విద్యాబోధనను వినోదాత్మకంగా రూపొందించడం, దేశ జిడిపిలో 6 శాతం నిధులు విద్యకు కేటాయించడం, వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యలో రిజర్వేషన్లు కల్పించడం లాంటి అనేక పటిష్ట చర్యలను తీసుకొనాలి. మనిషి తనని తాను అర్థం చేసుకుంటూ, కుటుంబాన్ని సన్మార్గంలో నడుపుతూ, సమాజహిత కార్యక్రమాలలో పాల్గొంటూ, వ్యక్తిగత మరియు దేశాభివృద్ధిలో భాగస్వామి కావడానికి అక్షరాస్యత మరియు ఉన్నత విద్య తప్పనిసరి అని గమనిస్తూ, ప్రతి ఒక్కరూ సంపూర్ణ అక్షరాస్యత సాధనా ఉద్యమంతో తలో చేయి వేద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఈ నెల 28వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**ప్రశ్నోత్తరాలకు గంట ..జీరో అవర్‌కు అరగంట సమయం**
**నేడి పివి శతజయంతి ఉత్సవాలపై చర్చ**
**10, 11 తేదీల్లో కీలకమైన రెవెన్యూ చట్టంపై చర్చ**
**మీడియా పాయింట్ ఎత్తేయడంపై భట్టి అభ్యంతరం**

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను ఈ నెల 28 వరకు తెలంగాణ నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. మొత్తం 17 రోజుల పాటు అసెంబ్లీ జరగనుంది. ప్రశ్నోత్తరాల్లో ఆరు ప్రశ్నలకు మాత్రమే అనుమతిస్తారు. ఇటు జీరో అవర్‌ను 30 నిమిషాలకు కుదించారు. గంటపాటు ప్రశ్నోత్తరాలు, అరగంటపాటు జీరో అవర్‌ను కొనసాగిస్తారు. పీవీ శతజయంతి ఉత్సవాలపై మంగళవారం సభలో చర్చ జరగనుంది.

ఇక 12, 13 , 20, 27 తేదీలను సెలవులుగా ప్రకటించారు. హాట్ హాట్‌గా సాగిన బీఏసీ సమావేశంలో కాంగ్రెస్.. మీడియాపాయింట్‌ను తొలగించడంపై అభ్యంతరం తెలిపింది. విపక్షం పాత్రను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సభలో తమకు ఎలాగూ మైక్ ఇవ్వరు... మీడియా పాయింట్‌ను కూడా తొలగిస్తే ఎలా?అని కాంగ్రెస్ ప్రశ్నించింది. అయితే సభకంటే కాంగ్రెస్ పార్టీకి మీడియా పాయింట్ ఎక్కువైందా? అని సీఎం వ్యాఖ్యానించినట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ సభ్యులకు సభలో మైక్ ఇవ్వలేదన్నది అవాస్తవమని అబద్దాలు మాట్లాడొద్దని సీఎం అన్నారు. కోవిడ్ కారణంగానే మీడియా పాయింట్‌ను ఎత్తేశామన్న సీఎం.. సభ్యుల సంఖ్యను బట్టి సమయం ఇస్తామని చెప్పారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన భేటీఅయిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం సభ నిర్వహణ, అజెండా తయారీపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈనెల 28 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈనెల 10, 11 తేదీల్లో అసెంబ్లీలో కీలకమైన రెవెన్యూ చట్టంపై చర్చచేపట్టనున్నారు. అలాగే భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టనుంది. సమావేశాలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ విపక్ష సభ్యులను కోరారు. అయితే మీడియా పాయింట్ ఎత్తివేయడంపై భట్టి విక్రమార్క అభ్యంతరం తెలిపారు. కోవిడ్ నేపథ్యంలోనే మీడియా పాయింట్ అనుమతించలేదని సీఎం కేసీఆర్ వివరించారు. సభ్యుల సంఖ్య ప్రకారం సభలో సమయం ఇస్తామని.. దాని ప్రకారం సభ్యులు నడుచుకుని తమ సమస్యలను వినిపించాలని సీఎం సూచించారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు మాట్లాడుతూ.. ప్రజలను గందరగోళ పరుస్తున్నారని, ఆ విషయాలను సభలో ప్రస్తావిస్తామని కేసీఆర్ తెలిపారు. సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి ప్రశాంత్ రెడ్డి,విపక్షనేత అక్బరుద్దీన్, మల్లు భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళనకరంగా తొలి క్వార్టర్ జిడిపి

**భారత జీడీపీలో 23.9 శాతం తరుగుదల దారుణం**
**ప్రభుత్వ విధానం స్వయం వినాశకారిగా ఉంది**
**పేదలకు నేరుగా నగదు ఇవ్వాలన్న రగురామరాజన్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): ఇటీవల రిలీజైన ఈ యేడాది తొలి క్వార్టర్ జీడీపీపై మాజీ ఆర్బీఐ గవర్నర్ రఘురాం రాజన్ స్పందించారు. ఆ జీడీపీ సంఖ్య మనకు హెచ్చరికలు జారీ చేస్తోందన్నారు. ద అలార్మ్ ఇన్ ద జీడీపీ నెంబర్స్ అన్న శీర్షికతో రఘురాం రాజన్ ఓ పోస్టు చేశారు. లింక్డిన్ అకౌంట్‌లో ఆయన దాన్ని షేర్ చేశారు. భారత జీడీపీలో 23.9 శాతం తరుగుదల దారుణమన్నారు. అసంఘటిత రంగాన్ని కూడా కలిపితే.. దాని ప్రభావం మరింత అధ్వాన్నంగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా తగ్గిన జీడీపీలతో ఆయన పోలిక చేశారు. ఇటలీ, అమెరికా దేశాలలో జీడీపీ 12.4, 9 శాతం పడిపోయినట్లు ఆయన చెప్పారు. ఆ దేశాలతో పోలిస్తే భారత్ మరింత దారుణంగా ఉందని, ఇంకా ఇండియాలో మహమ్మారి విజృంభిస్తున్నదని, ప్రభుత్వం ఇచ్చిన మినహాయి ంపులు ముఖ్యమైనవే అయినా అవి ఏమాత్రం సరిపోవన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం స్వయం వినాశకారిగా ఉందన్నారు. బాండ్ మార్కెట్ల నుంచి ఇండియా అప్పులు తెచ్చుకోవాలని రాజన్ సూచన చేశారు. పబ్లిక్ సెక్టార్ సంస్థల షేర్లు, ఆస్తుల అమ్మకాలతోనూ కొంత ఉపయోగం ఉంటుందన్నారు. ఆర్థిక స్థిరత్వం సాధించాలంటే ఈ చర్యలు తప్పవన్నారు. మన్రేగాకు మళ్లీ జీవం పోయాలన్నారు. పేదలకు నేరుగా నగదు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంత ప్రజలకు ఇది అవసరం అన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల బిల్లులకు త్వరగా క్లియరెన్స్ ఇవ్వాలన్నారు. చిన్న, మధ్య తరహా సంస్థలకు జీఎస్టీ లేదా కార్పొరేట్ ఇన్‌కం ట్యాక్సులో రిబేట్ ఇవ్వాలన్నారు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను పునరుత్తేజం చేయాలన్నారు. అమెజాన్, రిలియన్స్, వాల్మార్ట్ లాంటి వాటికి ప్రోత్సహం ఇవ్వడం వల్ల చిన్నతరహా వ్యాపారులకు ఊరట ఉంటుందన్నారు. భారత్‌కు బలమైన వృద్ధి కావాలని, కేవలం దేశ యువతను సంతోష పెట్టడం కాదు అని, సన్నితంగా లేని మన పొరుగువారిని దూరం పెట్టేందుకు కూడా బలైన ఆర్థిక వ్యవస్థ అవసరమని రాజన్ తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

# ఖాజీపల్లి అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకున్న ప్రభాస్

**అర్బన్ ఫారెస్ట్‌కు శంకుస్థాపన**

సంగారెడ్డి,సెప్టెంబర్7 (నేటినిజం ప్రతినిధి):: గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా జిన్నారం మండలం ఖాజీపల్లి అటవీ ప్రాంతాన్ని హీరో ప్రభాస్ దత్తత తీసుకున్నారు. దుండిగల్ సమీపంలోని ఖాజీపేట అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌ను అటవీ శాఖమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్‌తో కలిసి యంగ్ రెబల్ స్టార్ సోమవారం పరిశీలించారు. అర్బన్ ఫారెస్ట్ పార్కుకు శంకుస్థాపన చేసిన బాహుబలి మొక్కలు నాటారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెంట అందుబాటులోకి రానున్న మరో అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను తన తండ్రి దివంగత యూవీఎస రాజు పేరు మీద ప్రభాస్ దత్తత తీసుకున్నారు. ఇందుకోసం రెండు కోట్ల రూపాయలను అందించ డమే కాకుండా, అవసరాన్ని బట్టి మరింత ఖర్చు చేసేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ త్వరలో మరిన్ని అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లను దత్తతకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పీసీసీఎఫ్ శోభ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా టీఆర్‌ఎస్ ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు పూనుకున్న విషయం తెలిసిందే. ఈ ఛాలెంజ్‌లో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు ఇతరులతో నాటించాలి. ఇప్పటికే ఈ ఛాలెంజ్‌ను సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు స్వీకరించి మరికొంత మందికి సవాల్ విసురుతున్నారు. ఇక ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ హైదరాబాద్ శివార్లలోని కీసరగుట్ట అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకున్నారు. మొత్తం 2,042 ఎకరాల అడవిలోని కొంత భాగాన్ని ఎంపీ నిధులతో ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి, మిగతా ప్రాంతాన్ని అటవీ పునరుజ్జీవనం కింద రక్షిత అటవీ ప్రాంతంగా మార్చనున్నారు.

## జాతీయ రాజకీయాలకు కెసిఆర్ పనికిరారు: కోదండరామ్

వరంగల్,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో కొత్త పార్టీకి అవకాశం ఉందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అభిప్రాయపడ్డారు. కేంద్రంలో అలాంటి అవకావం ఉన్నా దానికి కెసిఆర్ పనికారడన్నారు. కేవలం కాంగ్రెస్, బిజెపిల చుట్టూ కేంద్ర రాజకీయాలు తిరుగుతున్న క్రమంలో మరో పార్టీ అవసరం ఉందన్నారు. కానీ కేసీఆర్ జాతీయ రాజకీయాలకు పనికిరారని తేల్చిచెప్పారు. కేసీఆర్ వైఖరి జాతీయ రాజకీయాల్లో పనికిరాదని, జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికి అవకాశం ఉన్నా.. దానికి కేసీఆర్ వైఖరి పనికిరాదని చెప్పారు. కేసీఆర్ జాతీయ పార్టీని తన ఫ్రెండ్ సీఎం జగనే మొదట అంగీకరించరని చెప్పారు. అధ్యక్ష తరహా ఎన్నికలు మన దేశంలో అసాధ్యమన్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందే కానీ.. అన్ని తప్పులకు వీఆర్వోలే కారణం కాదని కోదండరాం పేర్కొన్నారు.

## కంగనాకు కేంద్రం భద్రత ఆశ్చర్యం కలిగిస్తున్నది: మహారాష్ట్ర హోంమంత్రి

ముంబై సెప్టెంబరు7: మహారాష్ట్ర, ముంబైని అవమానించిన నటి కంగనాకు కేంద్రం వై కేటగిరి భద్రత కల్పించడం ఆశ్చర్యం కలిగిస్తున్నదని ఆ రాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. మహారాష్ట్ర అంటే కేవలం ఎన్సీపీ, శివసేన, కాంగ్రెస్ లేదా బీజేపీ కాదు ప్రజలు కూడా అని చెప్పారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రను అవమానించిన వ్యక్తులను అన్ని పార్టీలకు చెందిన ప్రజలు ఖండించాలని అనిల్ దేశ్‌ముఖ్ పిలుపునిచ్చారు.

కాగా, నటి కంగనా రనౌత్ హిమాచల్ ప్రదేశ్ కూతురని ఆ రాష్ట్ర సీఎం జె.ఆర్ ఠాకూర్ తెలిపారు. కంగనా భద్రత గురించి ఆమె తండ్రి ఆందోళన చెంది తనకు లేఖ రాశారని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కంగనాకు ఎలాంటి హానికలుగకుండా చూడాలని డీజీపీకి సూచించానని చెప్పారు. మనాలీలో తన కుటుంబంతో ఉన్న కంగనా భద్రత కోసం ఒక పోలీస్ బృందాన్ని పంపినట్లు వివరించారు. మరోవైపు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య అధికారులు సోమవారం కంగనా నివాసానికి వెళ్లి ఆమెతోపాటు సోదరికి కరోనా పరీక్ష చేశారు.

సుశాంత్ మరణం కేసులో డ్రగ్స్ విషయాన్ని ప్రస్తావించిన తనను అరెస్ట్ చేసేందుకు ముంబై పోలీసులు ప్రయత్నిస్తున్నారని కంగనా ఇటీవల ఆరోపించింది. అయితే కంగనా తీరుపై శివసేన మండిపడుతున్నది. మహారాష్ట్ర, ముంబై పోలీసులను అవమానించిన వారు ఇక్కడకు రావాల్సిన అవసరం లేదని ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. దీంతో మహారాష్ట్ర ఏమైనా పాక్ ఆక్రమిత కశ్మీరా అని కంగనా ప్రశ్నించింది. ఈ నెల 9న తాను ముంబైకి వస్తానని దమ్ముంటే తనను అడ్డుకోవాలని సవాల్ విసిరింది. ఈ నేపథ్యంలో కంగనాకు కేంద్రం వై కేటగిరి భద్రత కల్పించడంతో భారీ పోలీసు బందోబస్తుతో ప్రయాణం కోసం ఆమె సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## ఉత్తరాఖండ్‌లో మరో మంత్రికి కరోనా పాజిటివ్

డెహ్రాడూన్ సెప్టెంబర్ 7: ఉత్తరాఖండ్ కేబినెట్ మంత్రి మదన్ కౌశిక్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. యాంటిజెన్ రిపోర్ట్‌లో ఆయనకు పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఆదివారం రాత్రి రిషికేశ్‌లోని ఎయిమ్స్ దవాఖానలో చేరినట్లు తెలిసింది.

కరోనా సోకిన వ్యక్తితో ప్రాథమిక కాంటాక్టుల్లో ఉండడం ద్వారానే మంత్రికీ కరోనా సోకినట్లు సమాచారం. శనివారం ఉదయం నుంచి ఆయన ఎవరినీ కలువకుండా, అన్ని అధికారిక కార్యక్రమాలను వాయిదా వేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ప్రతినిధి అయిన మంత్రి మదన్.. తనతో ప్రాథమిక కాంటాక్టుల్లో ఉన్న పార్టీ నాయకులు, పాత్రికేయులు కూడా కరోనా పరీక్షలు చేయించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ అధ్యక్షతన గత వారం జరిగిన మంత్రివర్గ సమావేశానికి కౌశిక్ కూడా హాజరయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

జయశంకర్ భూపాలపల్లి ,సెప్టెంబర్7 (ఆర్‌ఎన్‌ఎ): రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన జిల్లాలోని పలిమెల మండలంలోని లెంకలగడ్డ బండలవాగు సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో చిడం సునీల్ (18) మృతి చెందగా దుంప రాజశేఖర్ (25)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పలిమెల మండలంలోని మోదేడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వివిధ అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మహాదేవపూర్ మండలంలోని అంబటి పల్లికి వెళ్లి మోదెడు గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. లెంకలగడ్డ-వంకెన బండలవాగు సమీపంలో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో సునీల్ అక్కడిక్కడే మృతి చెందాడు. రాజశేఖర్ తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన రాజశేఖర్ ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

## గాంధీ,ఉస్మానియాల్లో కరోనా టెస్టులు చేయడం లేదు

**నివేదిక సమర్పించాలన్న హైకోర్టు**

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): గాంధీ, ఉస్మానియాల్లో కోవిడ్ పరీక్షలు చేయడం లేదన్న పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఆస్పత్రుల్లో కరోనా లక్షణాలున్నవారిని గాంధీ, ఉస్మానియాల్లో పరీక్షలు నిర్వహించడంలేదని, టెస్టుల కోసం వచ్చిన వారు తిరిగి వెళ్లిపోతున్నారని, దీంతో కరోనా వ్యాప్తి జరుగుతోందని పిటిషనర్ తన వాదనలు వినిపించారు. కోర్టు ఆదేశాలిచ్చినా ఆస్పత్రుల్లో బెడ్స్‌పై డిస్‌ప్లే లేదన్న పిటిషనర్ అన్నారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికతో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశిస్తూ.. తదుపరి విచారణ ఈనెల 23కు వాయిదా వేసింది.

# పట్టాలకెక్కిన మెట్రో రైళ్లు

**తొలిదశలో పరిమిత సంఖ్యలో నడిచిన సర్వీసులు**
**మియపూర్ నుంచి ఎల్బీనగర్ మధ్య తొలి సర్వీస్**




హైదరాబాద్‌లో మళ్లీ పెట్టాలకెక్కిన మెట్రో రైలు

హైదరాబాద్హైదరాబాద్,సెప్టెంబరు7 (ఆర్‌ఎన్‌ఎ): లాక్‌డౌన్‌తో బ్రేకులు పడిన మెట్రో రైలుసేవలు పునః ప్రారంభవయ్యాయి. మొదటి రైలు ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్‌కి నడిచింది. అన్‌లాక్ 4తో తిరిగి మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. తొలి దశలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం నాలుగింటి నుంచి రాత్రి 9గంటల వరకు మాత్రమే నడపుతున్నారు. ప్రతి 5 నిమిషాలకు ఒక ట్రైన్ నడుపుతూ.. రద్దీని బట్టి టైమింగ్స్ లో మార్పులు చేయనున్నారు. మెట్రో రైలు పునః ప్రారంభమైన సందర్భంగా ఫిజికల్ డిస్టెన్స్ మెయింటెన్ చేసేందుకు ఒక్కో ట్రైన్‌లో 300 మందికి.. ఒక కోచ్‌లో 100 మంది చొప్పున అనుమతిస్తున్నారు. కరోనాకు ముందు ఒక్కో ట్రైన్‌లో వెయ్యి మందిదాకా జర్నీ చేసేవారు. అయితే సోమవారం తొలి రోజు కావడంతో కొద్ది సంఖ్యలోనే వచ్చారు. ట్రైన్ లో కోవిడ్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేశారు. తొలి దశలో కొద్దిరోజులపాటు డైలీ 10వేల నుంచి 15వేల మంది ప్రయాణికులు జర్నీ చేసే అవకాశముందని మెట్రో వర్గాల అంచనా. కొవిడ్ రూల్స్?కి అనుగుణంగా ప్రతి స్టేషన్?లో ఐసోలేషన్ రూమ్‌లు ఏర్పాటు చేసి థర్మల్ స్క్రీనింగ్, శానిటైజర్, ఫిజికల్ డిస్టెన్సింగ్ కోసం మార్కింగ్లు ఏర్పాటు చేశారు. ట్రైన్‌లో 75 శాతం ఫ్రెష్ ఎయిర్ ఉండేందుకు అక్కడక్కడా టెర్మినల్స్ వద్ద ట్రైన్ డోర్లు కొద్దిసేపు తెరిచి ఉంచుతున్నారు. డైలీ స్టేషన్లలో డిస్ ఇన్?ఫెక్టివ్ ?స్ప్రేత్రోపాటు, రాత్రిళ్లు ?ట్రైన్లను శానిటైజ్ చేస్తున్నారు. స్టేషన్లు, ట్రైన్స్?లో శానిటైజర్? అందుబాటులో ఉంటుంది. ఫేస్ మాస్క్ తప్పనిసరి. లేని వారు స్టేషన్?లోనే కొనుక్కునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్యాసింజర్స్ టికెట్స్ తీసుకునే టైమ్ లో ఆన్ లైన్, స్మార్ట్ కార్డ్, క్యూ ఆర్ కోడ్ ని యూజ్ చేసి కొనుగోలు చేసేలా ఏర్పాటు చేశారు. టోకెన్ సిస్టమ్‌ను రద్దు చేశారు. జర్నీ టైమ్ లో మినిమమ్ బ్యాగేజ్ మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు.

# అసెంబ్లీ ఉభయసభలు నేటికి వాయిదా

**ఉభయసభల్లో ప్రణబ్‌కు ఘనంగా నివాళి**
**దివంగత నేతలకు నివాళి అర్పించిన అసెంబ్లీ**

హైదరాబాద్,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ శాసనసభ,మండలి మంగళవారానికి వాయిదా పడ్డాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఉభయసభల్లో ఇటీవల మృతి చెందిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మృతిపట్ల సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. శాసనసభలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ రెండు సంతాప తీర్మానాలను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించి.. నివాళులర్పించారు. మాజీ సభ్యులు కావేటి సమ్మయ్య, జువ్వాడి రత్నాకర్ రావు, పోచయ్య, పి రామస్వామి, మస్కు నర్సింహ, బి కృష్ణ, సున్నం రాజయ్య, ఎడ్మ కిష్టారెడ్డి, మాతంగి నర్సయ్య మృతి పట్ల సభ నివాళులర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. మండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రణబ్ సంతాప తీర్మానాన్ని హోంమంత్రి మహ్మద్ అలీ ప్రవేశపెట్టారు. ఆయన గొప్పతనాన్ని ప్రస్తావించారు. మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్,సితా ఇంద్రారెడ్డి, చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. ప్రణబ్తోఓ ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పాటులో ప్రణబ్ చూపిన చొరవను స్మరించుకున్నారు. కాగా, అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. కోవిడ్ నిబంధనలు పాటించి సభ్యులంతా సమావేశాలకు హాజరయ్యారు. కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, నెగటివ్ వచ్చినవారినే సభలోకి అనుమతించారు. సోమవారం నాటి సమావేశంలో ఇటీవల మృతి చెందిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మొదలకు వారికి శాసన సభ సంతాపం ప్రకటించింది. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది.

# సుశాంత్ సింగ్ సోదరి ప్రియాంక సింగ్‌పై కేసు

**ముంబై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రియా**

ముంబై,సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): సుశాంత్ సింగ్ సోదరి ప్రియాంక సింగ్‌పై ముంబై పోలీస్ స్టేషన్‌లో రియా కేసు నమోదు చేసింది. ఆరు పేజీలతో కూడిన ఫిర్యాదుని రియా పోలీసులకు అందజేయగా, అందులో తన సోదరి ప్రిస్క్రిప్షన్ లేకుండా చట్టవిరుద్ధంగా సైకోట్రోఫిక్ పదార్థాలను సూచించిందని, అది వాడిన తర్వాత ఐదు రోజులకి సుశాంత్ మరణించాడని పేర్కొంది. ప్రియాంక సింగ్, డాక్టర్ తరుణ్ కుమార్ పై ఐపిసి 1860, నార్కోటిక్స్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ డ్రగ్స్ యాక్ట్, 1985 టెలిమెడిసిన్ ప్రాక్టీస్ గైడ్‌లైన్స్, 2020 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రియా తన ఫిర్యాదులో కోరారు. ఇటీవల సుశాంత్ సోదరి ప్రియాంక చాట్ లీక్ కాగా, అందులో సుశాంత్ మానసిక స్థితి, డిప్రెషన్ గురించి ఆమె సోదరికి ముందే తెలుసని స్పష్టమవుతోంది. ఈ సమస్య నుంచి బయటపడేందుకు మందులను కూడా వాడాలని ప్రియాంక సూచించారు. లిబ్రియమ్ (క్లోర్డియాజిపోక్సైడ్)ను వారం రోజులపాటు, ఆ తర్వాత నెక్సిటోను ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత వాడాలని సుశాంత్‌కు ఆమె సోదరి ప్రియాంక మెస్సేజ్ చేశారు. తీవ్ర ఆందోళనగా అనిపించినప్పుడు లొనాజెప్‌ను వేసుకోమని తెలిపారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వరు కదా అని సుశాంత్ అనుమానం వ్యక్తం చేయగా, తాను ఎలాగోలా మేనేజ్ చేసి తెస్తానని చెప్పింది ప్రియాంక. తన మిత్రురాలు డాక్టర్ అని, ఆమె సహాయంతో ముంబైలోని మంచి వైద్యున్ని కలిసి చికిత్స కోరుదామని తెలిపారు. అనంతరం మందుల ప్రిస్క్రిప్షన్ షేర్ చేసిన ఆమె, ఇందులో ఉన్న మూడు ఔషధాలు మానసిక ఒత్తిడి, ఆందోళనకు వాడేవే కాగా లిబ్రియమ్‌ను డ్రగ్స్ నివారణకు కూడా వినియోగిస్తారు. కాగా సుశాంత్ కుటుంబ సభ్యులు అడిగితేనే ఆయన వాడాల్సిన ఔషధాలు రాసిచ్చానని ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి వైద్యుడు డా. తరుణ్ కుమార్ వెల్లడించారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని రియా.. ప్రియాంకపై కేసు పెట్టింది.

# ప్లాస్మా దానం చేసి ప్రాణదాతలుగా నిలవండి : వరంగల్ సీపీ



వరంగల్ అర్బన్, సెప్టెంబర్ 7 : ప్లాస్మా దానం చేసి ప్రాణదాతలుగా నిలవండని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌అ న్నారు. ప్లాస్మా దానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూపొందించబడిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వరంగల్ కమిషనరేట్ పరిధిలో పాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్ కు సంబంధించిన కరోనా వ్యాధిగ్రస్తుల చికిత్స నిమిత్తం అత్యవసర సమయాల్లో కావాల్సిన ప్లాస్మాను సమకూర్చేందుకుగాను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ములో నూతనంగా కోవిడ్-19 కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం వరంగల్ కమిషనరేట్ అదనపు డీసీపీ గిరిరాజు, ఆర్.ఐ నగేష్ పర్యవేక్షణలో కరోనా వ్యాధి నుంచి కోలుకోని ప్లాస్మా దానం చేసేందుకు సిద్ధంగా వున్న ప్లాస్మా దాతల పూర్తి సమాచారాన్ని ఈ సెంటర్ ద్వారా సేకరించబడుతుందన్నారు. అదే విధంగా ప్లాస్మా అవసరమైన వారు ఈ కోవిడ్ కంట్రోల్ వాట్సప్ నంబర్ 9491873930కు పూర్తి సమాచారాన్ని అందజేస్తే వారికి ప్లాస్మా దానం చేసేందుకు ముందుకు వచ్చిన దాతల సెల్ నంబర్లతో కూడిన వివరాలను అందజేస్తామన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.